వార్త

ఆదివారం

27 ఏప్రిల్, 2025



# మూసీ ప్రస్థానం



# తారాతీరం

## సైన్స్‌ఫిక్షన్.. 'బిల్లా రంగా బాషా'



**పాన్ ఇండియా** స్థాయిలో 'హను-మాన్' సినిమాని నిర్మించి విజయాన్ని అందుకున్నారు. ప్రైమ్ షో ఎంటర్ టైన్‌మెంట్ అధినేతలు కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి. ఈ నిర్మాతలు మరో పాన్ ఇండియా చిత్రానికి శ్రీకారం చుట్టారు. ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ కథానాయకుడిగా 'బి.ఆర్.బి' (బిల్లా రంగా బాషా) పేరుతో ఈ చిత్రం రూపొందుతోంది. ఫస్ట్ బ్లడ్.. అనేది ఉపశీర్షిక. అనూప్ బండారి దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. 'సైన్స్ ఫిక్షన్ కథతో రూపొందుతున్న యాక్షన్ చిత్రమిది. 2209 ఎ.డి నేపథ్యంలో సాగుతుంది. ఓ సరికొత్త అనుభవాన్ని పంచే వినోదం ఇందులో ఉంటున్నట్లు తెలుస్తోంది.

## సెప్టెంబరులో 'మదరాసి'

**శివకార్తికేయన్,** ఎ.ఆర్. మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న హైఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మదరాసి. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా అద్భుత స్థాయిలో రూపొందుతోంది. ఈ ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్టైనర్ యాక్షన్ ప్యాక్డ్ గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. సెప్టెంబర్ 5న సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శివకార్తికేయన్ ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. తన ఇంటెన్సీవ్ నెరేటివ్ గ్రిప్పింగ్ స్టోరీ టెల్లింగ్‌తో ఆకట్టుకునే ఎఆర్ మురుగదాస్ మదరాసితో సరికొత్త ఎక్సయిటింగ్ యాక్షన్‌ప్యాక్డ్ కథను చూపించబోతున్నారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సుదీప్ ఎలామోన్. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అరుణ్ వెంజరమూడు ఆర్ట్ డైరెక్టర్. యాక్షన్ కొరియోగ్రఫీని కెవిన్ మాస్టర్, దిలీప్ మాస్టర్ పర్యవేక్షిస్తారు.



ఆదివారం వార్త

20 ఏప్రిల్, 2025

## మంచి ముత్యాలు

మంచి మాటలు వినటానికి చదవటానికి అదృష్టం ఉండితీరాలి.
ఆలోచన మారాలి, అద్భుత రచనలను ప్రశంసించాలి.
పరిస్థితిని అర్థం చేసుకుని ప్రవర్తిస్తే అధోగతి ఎదురవదు. ప్రమాదం ఉండదు.
అవకాశాన్ని సృష్టించుకోవటంలో వుంది గొప్పతనం.

## కదంబం


'సంఘీ'భావం....5

యాసంగిలో అన్నదాతల వెతలు

కవర్ స్టోరీ..6

మూసీ ప్రస్థానం

సాహిత్యం.. 11

ఈ వారం కవిత్వం...12

పుస్తకం మస్తిష్క వికాస సాధనం 14

కథ..20

ఎవరి దారి వారిదే

యుద్ధావం తర్భవతి ! - 24

వాస్తు 25

శ్రీగిరి శ్రీహరివాసం - 26

మొఖాసాల కళ

ఏటికొప్పాకతో ఫిదా! 27

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా..వగైరా..


# సమాచారం

## పండ్లు పాడవకుండా..



బజారు నుంచి తెచ్చేటప్పుడు పచ్చిగానే ఉంటాయి. పండటానికి ఇంకా సమయం పడుతుందిలే అనుకునేలోపు.. అరటిపండ్లు సపోటాల్లాంటివి ఒకేసారి మగ్గిపోతాయి. అందులో చాలామటుకు తినకుండానే పారేయాల్సి వస్తుంది. అలా కాకుండా ఆ పండ్లని నిదానంగా పండేలా చేస్తుందీ 'బ్లూ ఆపిల్'. పండ్ల నుంచి వెలువడే ఇథలీన్ గ్యాస్‌ని గ్రహించి అన్నీ ఒకేసారి మగ్గిపోకుండా చేసేలా కొన్ని రకాల సహజ పదార్థాలతో ఈ బ్లూ ఆపిల్‌ని రూపొందించారు. ఒక్క ఆపిల్ ఆకారంలోనే కాకుండా టొమాటో ఆకృతిలోనూ దొరుకుతున్న వీటిని పండ్ల బుట్టలూ, కాయగూరలూ ఉంచే చోట పెడితే త్వరగా పాడవకుండా ఉంటాయి.



### జల్‌బత్తీలు

పూజల్లో ఉపయోగించే అగరొత్తుల గురించి తెలుసు. మరి జలబత్తీల గురించి ఎప్పుడైనా విన్నారా? అగరొత్తులని గుళ్లలో, ఇళ్లలో చేసే పూజల్లో పరిమళాలు వెదజల్లేందుకు వాడితే ఈ జలబత్తీలను నీటి కాలుష్య నివారణకు ఉపయోగిస్తారు. మొన్నటి వరకూ కుంభమేళాలో భాగంగా నదీస్నానాలు చేసిన వారిలో కూడా లక్షమంది ఈ జలబత్తీలతో గంగమ్మని పూజించారట. పూల పండ్లతోపాటే ఈ జలబత్తీలనీ నదిలోకి జార విడిచారు. ఇంతకీ వీటిని వేటితో చేస్తారో తెలుసా! ఇళ్లలో, కొన్ని దుకాణాల్లో దిష్టి తగలకుండా పెట్టే తెల్లని పటికని చూస్తే ఉంటారు కదా. దాంతోనే తయారుచేస్తారు. పటికని శాస్త్రీయంగా పొటాష్ ఆలమ్ అంటారు. ఈ పాటికి నీటిని శుద్ధి చేసే గుణంతో పాటూ చర్మ ఆరోగ్యాన్ని కాపాడే శక్తి ఉంటుంది. అలాగే రక్తస్రావానికి అడ్డుకట్ట వేసి గాయాలు వేగంగా మాన్పుతుంది. ఇన్ని సుగుణాలున్నాయి కనుకనే.. కుంభమేళాకోసం ఐటీసీ సంస్థ ఈ జలబత్తీలని ప్రత్యేకంగా తయారు చేసింది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com





# పూల సౌరభాలు




ఇంట్లో మొక్కలు, పూలు ఉంటే వచ్చే అందమే వేరు కదా! వాటిని చూస్తుంటే వాతావరణం ప్రశాంతంగా అనిపించడమే కాదు, ఆకర్షనీయంగానూ ఉంటుంది. అందుకోసమే.. ఇంట్లోనూ, ఆఫీసుల్లోనూ భిన్న ఆకృతుల్లో ఉండే వాజుల్ని ఎంచుకుని వాటిల్లో పూల కొమ్మల్ని అందంగా సర్దేస్తారు. అలాగని అందులో వైవిధ్యం కనిపించకపోతే ఏం బాగుంటుంది అంటోంది ఈ తరం. ఇంట్లో ఉండే ప్రతి వస్తువవూ ఓ అందమైన కళాఖండంగా ఉండాలని కోరుకుంటోంది. ఫ్లవర్ వాజుల్ని ఎంచుకునే విషయంలో తమ సృజనాత్మకతకు పదునుపెడుతోంది. స్టీలు, ఇత్తడి బకెట్లను ఇందుకోసం ఎంచుకోవడంతో.. ఇప్పుడు ఈ బకెట్ వాజులే ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఆ మధ్య సోనమ్ కపూర్ తన హోమ్ టూర్‌లో భాగంగా స్టీల్ బాల్టీ(బకెట్) గురించి ప్రత్యేకంగా చెప్పుకొచ్చింది. వీటిలో పూలు, మొక్కలను ఉంచి టేబుల్ మీద ఉంచితే చాలు. అటు సంప్రదాయం, ఇటు ఆధునికత కలబోతగా కనిపిస్తుంది. ఇత్తడి, స్టీలుని అంటే ఖరీదేమో అని ఆలోచించక్కర్లేదు. ప్రత్యేకించి కొనకున్నా, ఇంట్లో ఉన్న వాటినే ఇందుకు ఉపయోగించుకోవచ్చు. భలే చూడముచ్చటగా ఉన్నాయి కదూ..










'సంఘీ' భావం



# యాసంగిలో అన్నదాతల వెతలు

ఈసారి యాసంగి సీజన్ అన్నదాతలకు కంటనీరు కారేలా చేస్తోంది. ఒకపక్క అకాల వర్షాలు వెంటాడుతుండగా మరోపక్క తడిసిన ధాన్యం ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఈ సీజన్‌లో సకాలంలో నీరందక రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. ఆశించిన మేరకు నీటి లభ్యత ఉండకపోవడంతో కనీసం పెట్టుబడి అయినా వస్తుందో లేదా అన్న భయాందోళనలు వెంటాడాయి. ఆ తరువాత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పంటల సాగు సాఫీగా సాగింది. అయితే సరిగ్గా పంట చేతికి వస్తున్న తరుణంలో అకాల వర్షాలు రైతులకు శాపంగా పరిణమించాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు 5 ఉమ్మడి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం కలిగింది. పొట్టకొచ్చి ఈనే దశలో ఉన్న వరి, మొక్కజొన్న తదితర పంటలు వడగండ్ల దెబ్బకు నేలకొరిగాయి. కొన్నిచోట్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం, మక్కలు తడిపోయాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. ఒక్కసారిగా వచ్చిన ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కురిసిన వానకు వరి చేలు దెబ్బతిన్నాయి. సరిగ్గా సీజన్ సమీపిస్తున్న సమయంలో మామిడి నేలరాలింది. ముఖ్యంగా మహబూబ్ నగర్, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం రైతన్నలను కష్టాల పాలు చేసింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఈదురుగాలులతో వర్ష బీభత్సం సృష్టించింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో భారీ వర్షం పడింది. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, దండేపల్లిలో వడగండ్ల వాన కురిసింది. కాగజ్‌నగర్‌లోని దుకాణాలపై కప్పులు ఎగిరిపడ్డాయి. పెద్దపల్లి జిల్లా మంథని, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం వ్యాప్తంగా మోస్తరు వాన కురిసింది. మెదక్ పట్టణంతోపాటు, మెదక్ రూరల్, పాపన్నపేట కొల్చారం మండలాల్లో వర్షం పడింది. జగిత్యాల జిల్లా, కరీంనగర్ జిల్లాలలో ఈదురుగాలుల వాన కురిసింది. చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో నిల్వ చేసిన మొక్కజొన్న ధాన్యం కొట్టుకుపోయింది. ముందుగా నాట్లు వేసిన వారికి పంట చేతికి రావడంతో పాటు, రాష్ట్రంలో అకాల వర్షాల భయంతో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల కొరత పెద్దఎత్తున ఏర్పడటంతో రైతులు వరికోత యంత్రాలనే నమ్ముకుని వాటిపై ఆధారపడ్డారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో అకాల వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులు తరచూ పడుతుండటంతో లక్షలాది ఎకరాల్లో వరి చేలు నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మబ్బులు పడితే చాలు రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఈ నేపథ్యంలో వరి కోతలపైన రైతులు దృష్టిసారించారు. ఫలితంగా వరి కోత మిషన్లకు డిమాండ్ పెరిగి సకాలంలో దొరకడంలేదు. ఇదే అవకాశంగా చేసుకుని వరి కోత మిషన్ల నిర్వహకులు వాటి అద్దె రేటును పెంచేస్తున్నారు. తరుగు మూడు కిలోలు తీస్తున్నా పచ్చి ధాన్యం కావడం, మరోపక్క చేతిలో డబ్బులు పడిపోవడంతో కోసిన వరి గింజలు కోసినట్లే అమ్మేస్తున్నారు. కోసిన రోజునే పంట చేలు వద్ద కాంట పెట్టి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల నుండి వచ్చిన వ్యాపారులు ధాన్యాన్ని కోసిన వెంటనే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మరోపక్క రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో కోసిన ధాన్యాన్ని రైతులు నేరుగా మిల్లర్లకే విక్రయిస్తున్నారు. రాష్ట్రంతో పాటు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు చేల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడమే కాకుండా, రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబోసి నిల్వ ఉంచే పరిస్థితులు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరలకే విక్రయించి నష్టపోతున్నారు. మరోపక్క రాష్ట్ర మంత్రులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలిస్తున్నారు. ఏమేరకు పంట నష్టం జరిగిందన్న అంశంపై సత్వరంగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. సరిగ్గా పంట చేతికి వస్తున్న సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానలు కురియడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వెంటనే పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు కూడా ఒక విధానాన్ని ప్రకటించాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో రోడ్లపైనే వాటిని ఆరబోసి తిరిగి బస్తాల్లో ఎక్కించి మార్కెట్‌కు తరలించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే రైతుల పరిస్థితిని పరిశీలించిన దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దళారులు అప్పటికప్పుడు డబ్బు చెల్లిస్తూ ఉండటంతో రైతులు ఆర్థికంగా నష్టం కలుగుతున్నా వారికి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

తమలపాకుతో నువ్విట్లంటే..
తలుపుచెక్కతో నేనట్లంట అన్నట్టుగా
ఉంది ప్రకృతి వ్యవహరిస్తున్న తీరు.
ప్రకృతితో మానవుడు చెలగాటమాడే కొద్దీ
అంతకు రెట్టింపు స్థాయిలో ప్రకృతి
విరుచుకుపడుతున్నది.



# మూసీ ప్రస్థానం

మానవుడి నిర్వాకం వల్లనే ఎంతో అహ్లాదకరంగా ఉండే ప్రాంతాలు, నదులు, చెరువులు, కుంటలు కాలుష్య కాసారాలుగా మారుపోతున్నాయి. ఒకనాడు జంటనగరాలు మంచినీరుతో పాటు పరిసర గ్రామాలకు సాగునీరు అందించిన మూసీనది, నేడు దుర్గాంధభుయిష్టంగా మారి భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నది. ఇలా మూసీ ఈ దుస్థితికి చేరుకోవడం ఒకటి రెండు రోజుల్లో జరగలేదు. గత నాలుగైదు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యం, వీటన్నింటినీ మించి కొందరి అధికారుల అవినీతితో మూసీ పరిస్థితి ఇలా దిగజారిపోయింది. వాస్తవంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న, గ్రామాల్లో ఉన్న చెరువుల్లో ఆనాడు మంచినీరు తాగేవారు. అంతకు ముందు చరిత్రను చూసినా, ఇక్కడి చెరువుల్లో నుంచి కాకతీయ రాజులు వరంగల్‌కు తీసుకుపోయేవారని చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో ఉన్న చెరువును అందుకు ఉదహరించవచ్చు.

అందుకు నేటికి సజీవ సాక్ష్యంగా నిలిచిన ఆనాటి కాకతీయులు చెక్కించిన శిలాసాసనం దర్శనమిస్తున్నది. 'శక వర్షంభుల్ 1515 (క్రీస్తు శకం 1593) శ్రీముఖ నామ సంవత్సరం ముందు మాఘమాసంలో శుక్ల పక్షం పౌర్ణమి మాసం గురువారం నాడు సర్వజనుల శ్రేయస్సు అభివృద్ధిని గాంచి వేదవిజ్ఞులు, పురాణాజ్ఞులు పండితుల సమక్షంలో సముద్రమును తలపించేటి తటాకం నిర్మించడం ఈ ప్రాంతమంతా స్వచ్ఛమైన చల్లని గాలులతో పుష్పవాసనలతో సాక్షాత్తు లక్ష్మీనారాయణుల నివాసమేమోనన్న తలంపు తెచ్చుకున్నాడు'. తదితర వ్యాఖ్యలు నేటికి ఎదులాబాద్‌లో ఉన్న శిలాసానంపై దర్శనమిస్తాయి. పాలకుల నిర్వాహకంతో మూసీతో పాటు ఇలాంటి చెరువులెన్నో కాలుష్యకాసారాలుగా మారిపోయాయి.

ప్రకృతిసిద్ధమైన నదులు, చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని, వారి అవసరాల కోసం నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు కాలుష్యకాసారాలు కాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రకృతి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మానవ మనగడకు ముప్పు తప్పదు. హైదరాబాద్ మహానగరానికి లేక్‌సిటీ అనే పేరు ఉంది. ప్రస్తుతం లేక్‌సిటీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వేలాది చెరువులు కనుమరుగు అవుతున్నాయి. చెరువుల స్థానంలో భారీ భవంతులు, నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ నగరానికి మంచినీటిని అందించిన హుస్సేన్‌సాగర్ ప్రస్తుతం దుర్గంధాన్ని వెదజల్లుతుంది. ఒకప్పుడు నగరానికి మంచినీటిని అందించిన మరో నది మూసినది. ఈ మూసినది ఇప్పుడు మురికికూపంగా మారింది. హైదరాబాద్ నగరానికి గుండెకాయలాంటి ఈ రెండు ప్రస్తుతం కాలుష్యం, కబ్జాల చెరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. చెరువులు, నదులను కాపాడుకుంటే హైదరాబాద్‌కు నీటి సమస్య ఉండదు. ఒక్క హైదరాబాద్ నగరమే కాదు చుట్టూ జిల్లాలకు మంచినీటి సమస్య, సాగునీటికి సైతం సమస్యలు ఉండవు.

## మూసి పుట్టుక:

మూసీ నది ఒక చిన్న వాగుగా ప్రారంభమై తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత పొందిన సజీవ నదిగా ఖ్యాతి నొందింది. కాగా అది ఇప్పుడు ఎంతో దయనీయ స్థితిలో ఉందని చెప్పుకోవాల్సి వస్తోంది. నీటి జాడ ఉన్నా, అవి ప్రజా ప్రయోజనానికి దూరంగా ఉండడం అటు ప్రజల్ని, ఇటు పాలకులను ఆందోళనాచిత్తుల్ని చేస్తోంది. ఏనాటికైనా మూసీనదిని ప్రజలకు ఆమోదయోగ్యంగా మార్చాల్సిన ఆవశ్యకత కనపడుతోంది. మూసీనది ఆవిర్భావం నుంచి నదీ పరిణామ క్రమం చూస్తే పాలకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోంది. 1908లో వచ్చిన భారీ వరదలు మూసీ నదిపై ఉన్న అనేక తండాలను, కాలనీలను ధ్వంసం చేశాయి. ఆ తరువాత నదిపై నిర్మించబడిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నగరాన్ని వరదల నుంచి కాపాడేందుకు నిర్మితమయ్యాయనే చెప్పాలి. ఈ నది చరిత్ర, భౌగోళికం, ఇతరత్రా ప్రజల అనుబంధంతో ముడిపడిన కథలు చాలానే ఉన్నాయి.

## మూసీ పేరు ఎలా వచ్చిందంటే:

**కవర్ స్టోరీ**
**తిరుమల రావు**

ఇది ఒక పౌరాణిక ఇతిహాసంతో కూడా ముడిపడిన ఒకప్పుడు ఓ ఫకీర్ అయిన హజ్రత్ మబ్లూమ్ మహ్మద్ మొస్సా కాద్రి అనే సూఫీ సంత్ ఈ నదీ తీరాన తపస్సు చేసేవారు. ఆయన పేరు మీదే ఈ నదికి "మూసి" అనే పేరు వచ్చింది. స్థానికులు ఈ నదిని "మూసా వాగు" అని పిలిచేవారు, అది కాలక్రమేణా "మూసీ నది"గా మారిందని చెబుతారు.

## చారిత్రిక ప్రాధాన్యత:

కుతుబ్ షాహి పాలకులు, ఆ తర్వాత నిజాం కాలంలో మూసీ నది హైదరాబాదుకు తాగునీటి ప్రధాన సోర్స్ గానే కాక, వ్యాపార రవాణా మార్గంగా కూడా నిలిచింది. హైదరాబాదు నగరానికి ఈ నది ప్రాణవాయువు నందించిందని చెప్పుకోవాలి. మూసీ నది ఒక జీవన నది నుంచి కాలుష్య నదిగా మారిన క్రమంలో ప్రజల నిర్లక్ష్యం, పట్టణ విస్తరణ, మురుగు నీటి కంపు, పాలకుల అశ్రద్ధ వల్ల ఈ పవిత్ర నది ఇప్పుడు కాలుష్యనదిగా మారిపోయింది. అయినా దీనిని పునరుద్ధరించడం మన బాధ్యత.

## మూసి మార్గం: చరిత్ర

మూసి నది హైదరాబాదు నగరానికి 90 కిలోమీటర్లు పశ్చిమాన రంగారెడ్డి జిల్లా, వికారాబాదు వద్ద అనంతగిరి కొండల్లో పుట్టి నల్గొండ జిల్లా, వాడపల్లి (వజీరాబాద్) వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. 2,168 అడుగుల ఎత్తులో పుట్టి తూర్పు దిశగా ప్రవహించి హైదరాబాదు నుంచి ప్రవహిస్తుంది. నగరాన్ని



దాటిన తర్వాత మూసిలో చిన్నమూసి నది, అలేరు నదులు కలుపుకొని దక్షిణపు దిశగా మలుపు తిరుగుతుంది. మూసిలో ఆలేరు కలిసేచోట సూర్యాపేట వద్ద 1963లో పెద్ద జలాశయాన్ని నిర్మించారు. ఆ తరువాత పాలేరు నదిని కలుపుకొని వజీరాబాదు వద్ద కృష్ణానదిలో కలిసేటప్పటికి 200 అడుగుల ఎత్తుకు దిగుతుంది. మూసినది బేసిన్ వైశాల్యం 4,329 చదరపు మైళ్ళు. ఇది మొత్తం కృష్ణానది బేసిన్ వైశాల్యంలో 4.35 సాధారణంగా చిన్న వాగులాగా ప్రవహించే ఈ నది వరదలు వచ్చినప్పుడు బీభత్సం, అత్యంత జననష్టం కలిగించిన చరిత్ర ఉంది. మూసినదిపై హైదరాబాదు నగరంలో దాదాపు ఏడు వంతెనలు ఉన్నాయి. వీటిలో పురానా పుల్ (పాత వంతెన) అత్యంత పురాతనమైనది. గోల్కొండను పాలించిన కుతుబ్ షాహీ వంశస్తుడైన ఇబ్రహీం కుతుబ్‌షా 1578లో నిర్మించాడు. ఈ వంతెన ఇప్పటికీ ఉపయోగించుకుంటున్నాం. నయాపుల్ (కొత్త వంతెన) వంతెన హైకోర్టు సమీపంలో అఫ్జల్ గంజ్ వద్ద ఉంది. ఇవికాక ఇతర వంతెనలు డబీర్‌పూరా, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, నాగోల్, ఉప్పల్ కలాన్ వద్ద ఉన్నాయి. విజయవాడ వెళ్ళే జాతీయ రహదారి 7, వరంగల్ వెళ్ళే జాతీయ రహదారి 202 ఈ నది ఉత్తర, దక్షిణపు ఒడ్డుల వెంట సాగుతుంది. 20వ శతాబ్దపు తొలి దశాబ్దాల వరకు మూసినది తరచూ వరదలకు గురై హైదరాబాదు నగరాన్ని ముంచెత్తి నాశనం చేసేది. 1830లో యాత్రా చరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య ఈ ప్రాంతాన్ని సందర్శించి తన కాశీయాత్ర చరిత్రలో మూసి గురించి, దాని వరదల గురించి వివరించారు. ఆయన 1829లో మూసినదికి గొప్ప వరదలు వచ్చాయని రాశారు. ఢిల్లీ దర్వాజా వద్ద ఆంగ్లేయులు నిర్మించిన వారధిని ఆ వరద ప్రవాహం పగలగొట్టి, బేగంబజారులో కొన్ని వీధులను ముంచిందని రాసాడు. 1908 సెప్టెంబరు 28, మంగళవారం నాడు ఒక్కరోజులో 17 అంగుళాల వర్షం నమోదైంది. ఈ భారీ వర్షం ధాటికి మూసినది పొంగి పొర్లి వరదై హైదరాబాదు నగరమంతా పారింది. అఫ్జల్ గంజ్ వద్ద నీటిమట్టము 11 అడుగుల ఎత్తుకు చేరింది. మరికొన్ని ప్రాంతాలలో అంతకంటే ఎత్తుకు కూడా చేరింది. ఈ వరదలు హైదరాబాదు నగర జనజీవనాన్ని స్తంభింపజేసి అపార ఆస్తినష్టం కలుగజేసింది. జంటనగరాల అభివృద్ధిలో 1908లో ఈ వరదల తర్వాతనే ప్రారంభమైంది. దీనితో అంచెల వారీగా ప్రణాళికాబద్ధ నగరాభివృద్ధి అనివార్యమైనది. నగరాభివృద్ధికి ప్రణాళికను రూపకల్పనకు నియమితమైన సాంకేతిక నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, వరదలను నివారించడానికి, నగరంలో మౌలిక సౌకర్యాలను మెరుగుపరడానికి కొన్ని సూచనలు చేస్తూ 1909, అక్టోబరు 1న తన నివేదిక సమర్పించారు. ఏడవ నిజాం 1912లో నగరాభివృద్ధి ట్రస్టును ప్రారంభించారు. వరదలను నివారించేందుకు వరద నివారణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 1920లో మూసినదిపై ఒక నగరానికి పది మైళ్ళ ఎగువన ఉస్మాన్‌సాగర్ ఆనకట్టను కట్టించారు. 1927లో మూసి ఉప నదైన ఈసి నదిపై హిమాయత్‌సాగర్ జలాశయాన్ని నిర్మించారు. ఈ రెండు జలాశయాలు మూసి నదికి వరదలు రాకుండా నివారించడంతో పాటు హైదరాబాదు నగరానికి ప్రధాన మంచినీటి వనరులుగా ఉపయోగపడుతున్నాయి.

## నగరం నిండా మునిగింది

1908 సెప్టెంబరు 28 మంగళవారం నాడు నగరం మునిగింది. అఫ్జల్‌గంజ్ వద్ద నీటి మట్టం 11 అడుగులకు చేరింది. మరికొన్ని ప్రాంతాలలో అంతకంటే ఎక్కువ చేరాయి. జనజీవనం స్తంభించింది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అప్పుడు ఆయన మూసి, ఈసిల వరద ఉధృతి ఆపడానికి గండిపేట వద్ద మూసినదిపై (ఉస్మాన్‌సాగర్), ఈసా నదిపై (హిమాయత్‌సాగర్) వద్ద రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ ప్రకారమే రిజర్వాయర్లను నిర్మించారు. దీని కారణంగానే నగరానికి వరదలు రాకుండా ఈ రెండు రిజర్వాయర్లు ఆపగలిగాయి. నిర్మించారు అవి నిండిన తరువాత లంగర్‌హౌజ్ వద్ద కలుస్తాయి. అనంతరం అక్కడి నుంచి వాడపల్లి మీదుగా కృష్ణానదిలో మూసి కలుస్తోంది. అప్పట్లో నిర్మించిన నాలాలు ఇప్పుడు ఆక్రమణలు గురయ్యాయి. దీంతో వాటి పరిస్థితి ఇప్పుడు మరింత అధ్వాన్నంగా తయారైంది. వర్షాలు వచ్చినప్పుడు వరద నీరుతో మూసి ముందుకు వెళ్లలేక బస్తీలను ముంచెత్తుతుంది. ఒకప్పుడు తాగు, సాగునీరు అందించిన మూసి ఇప్పుడు మురికికూపంగా మారింది. మూసిపక్క నుంచి వెళ్లాలంటే ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎదులాబాద్, సూర్యాపేట చెందిన ప్రజలు గత కొన్ని



సంవత్సరాల వరకు కూడా మూసి నీటిని ఉపయో గించే వారు. కానీ ప్రస్తుతం అందులో వ్యర్థ రసాయనాలు ఎక్కువగా కలుస్తుండడంతో వాటిని ఉపయోగించడం మానేసారు. మూసినది కారణంగా కృష్ణనది కలుషితం అవుతుందని గత కొంత కాలం ఫిర్యాదులతో పాటు పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.



## మూసి పక్కకెళ్తే ముక్కు మూసుకోవాల్సిందే!

1980వ నుండి హైదరాబాదు నగర శివార్లలోని పారిశ్రామిక ప్రాంతాలలో వెలువడిన పారిశ్రామిక వ్యర్థ పదార్థాలను మూసిలోకి చేరడం ప్రారంభమైంది. అలా చిన్న చిన్న నాలాల్లో నుంచి మురుగునీరు, కలుషిత నీరు రావడం గణనీయంగా పెరిగింది. పెరుగుతున్న జనాభాతో నగరంలో మురికి నీరును మూసినదిలోకి వదలడంతో మూసి మొత్తం మురికి కాలువ స్థాయికి చేరింది. ప్రతిరోజూ జంటనగరాల నుండి వెలువడుతున్న 350 మిలియన్ లీటర్ల మురికినీరు, పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు మూసినదిలో కలుస్తున్నదని అంచన వేస్తున్నారు. ఆ తరువాత 1990వ సంవత్సరంలో ఈ మురికినీటిని శుద్ధి పరచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నంలో భాగంగానే మూసినది వెంట అంబర్‌పేటలో కలుషిత నీటి శుద్ధి ప్లాంటును ప్రారంభించారు. ఇది కేవలం 20ఎంఎల్‌డి నీటినే శుద్ధి చేసే సామర్థం ఉంది 2000లో నగరంలో నదిలోని నీటిని ఒక చిన్న కాలువ ద్వారా ప్రవహించేలా ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నందనవనం అనే ప్రాజెక్టును ప్రారంభించింది. కానీ అది మధ్యలోనే ఆగిపోయింది. నందనవనం ప్రాజెక్టులో భాగంగా మూసి నదీగర్భంలో మురికివాడలను నిర్మూలించాలని ప్రయత్నించారు. కానీ, మూసి బచావ్ ఆందోళన్ వంటి సామాజిక సంస్థలు, రాజకీయ ప్రతిపక్షాలు, వామపక్షాల వ్యతిరేకతతో అది సాధ్యం కాలేదు.

## మూసి ప్రక్షాళన సులువేనా?

మూసి ప్రక్షాళన అంత సులువు కాదు. మూసి నది వెంబడి వేలాది నిర్మాణాలు ఉన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూసిపరివాహక ప్రాంత ప్రజలను ఖాళీ చేయించే దిశగా చర్యలు ప్రారంభించింది. పేదవారిని ఖాళీని చేయించవద్దని, వారిని ముందుస్తుగా నోటీసులు ఇవ్వాలని విపక్షాలు సూచిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం మూసిపరివాక ప్రాంత ప్రజల విషయంలో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని, పేద లకు డబ్బులు బెడ్ రూం ఇండ్లను ఇస్తున్నామని, అంతేకాకుండా ఆర్థికంగా ఆదుకుంటామని పేర్కొంటుంది. ప్రతిపక్ష నేతలు వ్యవహరిస్తున్న తీరును కూడా పాలకులు తప్పుపడుతున్నారు. అంతేతప్ప మాధ్యేమార్గంగా మూసీ ప్రక్షాళనకు ముందుకు వెళుతున్న దాఖలాలు లేవు. రివర్‌బెడ్ పరిధిలో 1595 నిర్మాణాల్లో 1333కి మార్కింగ్ చేపట్టారు. నిరసనలు, ఆందోళన నేపథ్యంలో 262 ఆపేశారు. మొత్తం 824 నివాసాలకు 149 నివాసాలను కూల్చేశారు. మరోవైపు ఖాళీ చేయాలంటూ అక్కడ ఉన్న వారికి ప్రభుత్వం ఆదుకుంటుందని రెవెన్యూ అధికారులు కౌన్సిలింగ్ ప్రక్రియను చేపడుతున్నారు. మూసిపరివాహక ప్రాంతం ప్రస్తుత, పూర్వపాలకుల మధ్య రాజకీయాలకు అడ్డాగా మార్చుకుంటున్నారనే అపవాధను మూటగట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ప్రతిపాదించిన 55 కిలోమీటర్ల మేర వేల కుటుంబాలు జీవనాధారం సాగిస్తున్నాయి. అయితే వీరందరికి పునరావాసం కల్పించడంతో పాటు వారికి అక్కడ ఉన్న స్థలసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. మూసి వెంట పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగిస్తూ, అక్కడే జీవనోపాధి పొందుతుంటే పేదల రూపంలో పెద్దవారు ఆక్రమణలు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. 2022లో 8480 నిర్మాణాలు రివర్‌బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి సంఖ్య ఇప్పుడు 10 నుంచి 12వేల వరకు చేరింది. మూసినది ప్రక్షాళనకు సంబంధించి దాదాపు 10 నుంచి 12 సమీక్షలు నిర్వహించడంతో పాటు మూసిపై ప్రాజెక్టులకు శంకుస్థాపనలు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. అయితే మూసి ప్రక్షాళన చేస్తామంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం

'మూసి రివర్ ఫ్రంట్' ఏర్పాటు చేసింది. తెలంగాణ సర్వే, బౌండరీస్ చట్టం 1923 ప్రకారం 55 కిలోమీటర్ల మేర సర్వే చేపట్టారు. మూడు జిల్లాలు, 14 మండలాలు, 47 గ్రామాలలో సర్వే చేశారు. అంతేకాకుండా జి.ఓ.నెంబరు7, 05.01.2016 ప్రకారం మున్సిపల్ కార్పోరేషన్/మున్సిపాలిటీ/ నగరపంచాయతీ/ హెచ్ఎండిఎ/హుడా పరిధిలో 50మీటర్ల బౌండరీ పరిధిని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ బౌండరీలను మరో 50 మీటర్లకు పెంచారు. అంతేకాకుండా 14 బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించి, శంకుస్థాపనలు సైతం చేశారు. 2017 సంవత్సరంలో ఏర్పాటు చేసిన మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఇప్పటి



వరకు ఒక్క అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కు అన్న విధంగా పనిచేస్తోంది. అంతేకాకుండా మూసి కార్పోరేషన్ పేరుతో రుణాలను తీసుకున్నారు.

## మూసీపై రాజకీయాలు

హైదరాబాద్ నగరానికి కీలకంగా ఉన్న నది మూసినది. ప్రస్తుతం ఈ మూసినది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ మూసి ప్రక్షాళన అంశం తెరపైకి రాగానే ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సాధారణంగా మారుతున్నాయి. ప్రతిసారి మూసి ప్రక్షాళన అంశం రాజకీయ నాయకులకు అవకాశంగా మారి,అధికార పార్టీ వర్సెస్ ప్రతిపక్ష పార్టీలు అన్న విధంగా రాజకీయాలు సాగుతున్నాయి. కృష్ణానది బేసిన్ వైశాల్యంలో 4.35శాతం ఉన్న మూసినది ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతుంది.

తాగునీరు, సాగునీటికి ఉపయోగపడిన మూసీ ఇప్పుడు మురికిమయంగా మారింది. మూసినదిని ప్రక్షాళన చేస్తామంటూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించగా, ప్రస్తుత ప్రభుత్వం మూసి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తానంటోంది.

### మూసి సమగ్రాభివృద్ధికి రూ.1.50లక్షల కోట్ల ప్లాన్

మూసీ ప్రక్షాళన, సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగేట్ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తుంది. ఈ మాస్టర్ ప్లాన్‌లో నది మొత్తం విస్తీర్ణం, దాని పరిసర ప్రభావ ప్రాంతాలను పరిగణలోకి తీసుకోనున్నారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయం దిగువభాగం నుంచి మొదలై నగరానికి తూర్పుదిక్కున ఉన్న గౌరెల్లి సమీపంలో ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు సరిహద్దు వరకు, అదేవిధంగా హిమాయత్ సాగర్ దిగువ ప్రాంతం నుంచి బాపూఘాట్ వరకు మొత్తం 55 కిలోమీటర్ల మేర మూసిని అభివృద్ధి చేయనున్నారు. మూసి, ఈసి నదుల సంగమం వరకు కలిపి 55 కిలోమీటర్ల మేర ఉన్న నదీ పరివాహక ప్రాంతానికి సంబంధించి అగ్రిగేట్ మాస్టన్ రూపొందించనున్నారు. దీని కోసం రూ.1.50లక్షల కోట్ల ఖర్చును ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. మూసి ప్లాన్‌లో 5 అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. బ్లూ మాస్టర్‌ప్లాన్, మార్కెట్ ఫెసిబిలిటీ స్టడీ, ల్యాండ్ యూజ్ మాస్టర్ ప్లాన్, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫైనాన్సియల్ ఉన్నాయి. వీటన్నింటిలో బ్లూ మాస్టర్ ప్లాన్ కీలకమైంది. ఎందుకంటే నీటి వనరుల వినియోగానికి సమగ్ర నిర్వహణ, నీటి నాణ్యత నిర్వహణ, పర్యావరణ వ్యవస్థ సంరక్షణ, వరద నియంత్ర, ఉపశమనం, దీర్ఘకాలిక పర్యవేక్షణలు ఉన్నాయి. అదేవిధంగా రవాణా ఆధారిత అభివృద్ధి అంశం ఉన్నాయి. వీటిన్నటిపై ప్రత్యేక డిజైన్‌లను ప్రభుత్వం రూపొందిస్తుంది. ప్రధానంగా మూసిలోకి 1800 మిలియన్‌ల మురుగు నీరు కలుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో కేవలం 700 మిలియన్‌ల నీటిని మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మరో 1100 నీటిని శుద్ధి చేసేందుకు 38 ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకుని వస్తున్నారు. దీని కోసం రూ.3820కోట్లు ఖర్చు చేస్తున్నారు. మూసినది ప్రక్షాళన మూసినది నీరు మరోసారి తాగునీరు, సాగునీటిని ఉపయోగించే వరకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### అధ్యయన సంకల్పం:

అంతర్జాతీయ స్థాయిలో సుందరీకరించాలన్న తపనతో ప్రభుత్వం పలు విదేశీ నగరాలగుండా ప్రవహించే నదులను అధ్యయం చేసింది. వాటిలో లండన్‌లో థేమ్స్ నది, జపాన్‌లోని సుమిదా నది, దక్షిణ కొరియాలోని చియోంగీ చియాన్, దుబాయ్ వాటర్‌ఫ్రంట్, సింగపూర్ నదుల పరిశీలన చేశారు. టోక్యో మహానగరం మధ్య నుంచి పారే సుమిధా నది రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేసిన తర్వాత పర్యాటకులను విశేషంగా ఆకర్షించింది.



వీటిని తలదన్నే స్థాయిలో మూసీ ప్రక్షాళన, సుందరీకరణ కోసం ప్రభుత్వం తలపెట్టింది.

మూసీకి పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే అధికారులు దేశంలోని వివిధ ప్రాంతాలలో నదుల పునరుజ్జీవనం ఏ విధంగా అభివృద్ధి చేశారో పరిశీలన చేస్తున్నారు. ఇదే సమయంలో వివిధ దేశాల్లో సిఎం రేవంత్ బృందం పెట్టుబడుల సేకరణ కోసం పర్యటించినప్పుడు కూడా ఆయా దేశాల్లోని నదుల పునరుజ్జీవన స్థితిగతులను కూడా పరిశీలిస్తుంది. గత మూడు నాలుగు నెలల క్రితం దక్షిణ



కొరియాలో తెలంగాణాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు జర్నలిస్టుల బృందం పర్యటించింది. నగరంలో మధ్యలో నది ఏ విధంగా ప్రవహిస్తుంది, తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ నది సైతం కాలుష్య కోరల్లో ఉందని, దీని కోసం చాలా శ్రమించామని, తీసుకున్న చర్యలను అధికారులకు వివరించారు. కాలుష్యంకోరల్లో ఉన్న ఆ నది తరువాత పర్యటకంగా ఏ విధంగా అభివృద్ధి చేశారన్న అంశాలపై మంత్రుల బృందం క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ తరువాత గుజరాత్‌లోని సబర్మతి నదిపై సైతం అధికారులు అధ్యయనం చేశారు. అంతేకాకుండా వివిధ దేశాలు, దేశంలో వివిధ ప్రాంతాలలో మురుగు నీటిలో ఉన్న నదులను ఏ విధంగా అయితే ప్రక్షాళన చేస్తున్నారో వాటన్నింటిపై అధికారుల బృందం దృష్టి సారించి, ఆ దిశగా చర్యలు ప్రారంభిస్తుంది. కాలుష్య కోరల్లో మూసినది పునరుజ్జీవనం చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తుంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మూసికి పునరుజ్జీవనంతో పాటు పరివాహక ప్రాంత అభివృద్ధితో పాటు పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుంది. మొదటగా మూసిని ప్రక్షాళన చేయడం, అందులో భాగం గానే ఎస్‌టిపిల నిర్మాణం, కాలుష్య నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. ఆ తరువాత పరివాహక ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి దృష్టి సారిస్తున్నారు. పార్కుల నిర్మాణం, ప్లే గ్రౌండ్‌ల ఏర్పాటు , హోటళ్లు, భారీ అంతస్తుల భవనాలు తదితర వాటికి సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ చర్యలతో పాలు మూసి వెంట ఉన్న చారిత్రక కట్టడాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం చేయనున్నారు. అదే విధంగా నగరంలో ఉన్న ట్రాఫిక్ సమస్యకు సైతం చెక్ పెట్టనున్నారు. వరదలు వచ్చినప్పుడు రాజధాని నగరం నీట మునగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మూసి పరివాహక ప్రాంతంలో ప్రజలకు జీవనోపాధి దెబ్బతినకుండా పకడ్బందీతో ప్రణాళిక చేస్తున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో అక్రమ నిర్మాణాలు జరగకుండా తదితర వాటిపై కార్యాచరణ చేస్తున్నారు.

# మెడ నొప్పి

బెడ్ మీద నుంచి లేవలేకపోయాడు రామమూర్తి.

గట్టిగా 'నొప్పి నొప్పి' అని అరిచాడు.

పక్కనే పడుకుని ఉన్న పద్మావతి 'అయ్యో ... రిటైర్ అయి ఆరేళ్ళు కూడా కాలేదు.

అప్పుడే గుండెల్లో నొప్పి వచ్చిందా' అని 'ఓ' అనిఏడుస్తూ గుండెలు బాదుకుంది.


రామమూర్తి మెల్లగా నడుము తిప్పి 'గుండెల్లో కాదు... మెడ" అన్నాడు. మెడ నొప్పి అయితే ఫరేదు అంటూ మంగళసూత్రం కళ్లకు అద్దుకుంది.

'మీకేమీ కాదు, నేను ముత్తయిదువగానే పోతానని సిద్ధాంతి ఎప్పుడో చెప్పాడు' అని ధైర్యం చెప్పింది. ఏడుపు ముఖం పెట్టి గోడ మీద ఉన్న సాయిబాబా ఫోటో చూశాడు.

హుయ్ ఫియర్, వెన్ అయాం హియర్' అన్న ట్లుగా చూశాడు బాబా.

చిన్నగా భర్తను తీసుకుని హాల్‌లో కూర్చబెట్టింది.

అప్పుడే ఇంట్లోకి వచ్చిన పాలవాడు 'అమ్మా ... మెడ పట్టినట్లుంది సార్‌కి. నా కొడుకు ఫిజియో థెరపిస్ట్. ఈ మధ్యనే క్లీనిక్ ప్రారంభించాడు. ఇలాంటి నొప్పుల్ని చిటికెలో బాగా చేసాడు" అని చెప్పాడు.ఇద్దరూ గబగబా స్నానం చేసి వేడివేడి ఫిల్టర్ కాఫీ తాగి నేరుగా ఫిజియోథెరపిస్ట్ దగ్గరకు వెళ్లారు. అయిదు సిట్టింగ్‌లు అవసరం అవుతుందని, వరుసగా అయిదు రోజులు వస్తే సరిపోతుందని చెప్పాడు. 'అన్నీ చెప్పాడు ఫీజు చెప్పలేదు, తెలిసిన మనిషి కదా, మనకి ఫ్రీగా ట్రీట్ మెంట్ ఇసాడు' అని ఇద్దరూ నవ్వుకుంటూ పేషెంట్ కేబిన్‌లోకి వెళ్లబోయారు.



ఇంతలో తెల్లడ్రెస్సు వేసిన నర్సు 'క్యాషా..కార్డా' అని అడిగింది. మేము డాక్టర్‌కి చాలా క్లోజ్ అన్నాడు తల వంచకుండానే రామమూర్తి. 'అందుకే అయిదు సిట్టింగ్‌లకు మూడు వేలు కాకుండా రెండున్నర వేలు తీసుకోమన్నాడు' అని బదులిచ్చింది.

తప్పదా అన్న ట్లుగా మెడ పక్కకి వాల్చి ప్రస్తుతానికి అయిదు వందలే ఉంది, మిగిలింది రేపు ఇస్తాం' అని చెప్పి డబ్బు ఇచ్చాడు. పేనులు లేకపోయినా నవ్వ ఉన్న ట్లుచాలాసేపు గోక్కొంది నర్సు. 'మన హాస్పిటల్‌కి లేకలేక వచ్చిన కేసు. వదులుకునేది ఎందుకు?' అని అనుకుంటూ 'సరే' అంది. 'వెళ్లి బెడ్ మీద పడుకోండి!' అంది.

ముసిముసినవ్వులు నవ్వుకుంటూ బెడ్ మీదకు చేరాడు. డబ్బు కట్టిన రశీదు చేతికిచ్చి 'చొక్కా విప్పండి' అంది. సిగ్గుమొగ్గలైనాడు రామమూర్తి. మీకు సిగ్గు పడటం కూడా వచ్చే!' అంటూ జోకు పేల్చింది పద్మా వతి.

'పక్కన పెళ్లాం అనే బల్లెం ఉందని మరచినాను' అని చెప్పి నెత్తి మీద మొటిక్కాయలు వేసుకున్నట్లు ఊహించి సర్వైకల్ ట్రాక్షన్ ఇప్పించుకుని లేచాడు.

ఇద్దరూ ఆటోలో ఇంటికి చేరారు.

అప్పుడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే సుధాకర్ బెంగళూరు నుంచి వచ్చాడు. నాన్నకి మెడనొప్పి వచ్చిందని తెలిసి కా ర్ మన్నాడు.

తన క్లాస్ మెట్ న్యూరో డాక్టర్‌ని, వెళ్లి ఒకసారి కలుద్దామని ఆఘ మేఘాల మీద తీసుకెళ్లాడు. ఆ డాక్టర్ 'తల ఉంటే తలనొప్పి , మెడ ఉంటే మెడనొప్పి సహజం అన్నారు.

రామమూర్తిని కుడి పక్కకి తల తిప్పమన్నాడు, ఎడమ పక్కకు తిప్పమన్నాడు.. పైకీ కిందకీ తలని ఆడించమన్నాడు. డాక్టరు చెప్పినట్లే బుద్ధిగా చేశాడు రామమూర్తి.

మెడని ఎక్స్ రే తీయించాడు.'దాన్ని తీక్షణంగా చూస్తూ' సమస్య ఏమీ కనిపించడం లేదే' అని అంటూ రామమూర్తిని 'మీ దిన చర్య ఏమిటి?' అని అడిగాడు. తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా' అని చెబుదామనుకున్నాడు రామమూర్తి.

గౌరవం తగ్గిపోతుందని స్టైల్‌గా నిలబడి 'పత్రికలు చదువుతాను సార్. కవితలు అల్లుతాను సార్' అన్నాడు.

వెంటనే డాకర్ 'ఈ మధ్యలో కవితా సమావేశాలు ఏమైనా జరిగాయా? అక్కడ మీకు సన్మానాలు లాంటివి ఏమైన చేశారా?' అని అడిగాడు. ఉగాదికి జరిగింది సార్. గొప్పగా కవిత చదివాను. అందరూ శాలువ, పూలమాలలతో సత్కరించారు.

'అదొక్కటేనా?' అని మళ్లీ అడిగాడు డాక్టర్.

వెంటనే శ్రీ రామ నవమి వచ్చింది సార్. అక్కడ కూడా వన్స్ మోర్ అని అరిచారు.

పూలమాలలు వేశారు' అని ఎగిరెగిరి సమాధానమిచ్చాడు.

'చాలు, మీ సమస్య అర్థంఅయిపోయింది. వెంటవెంటనే మీకు సన్మానాలు జరగడం వల్ల, తలను బాగా వంచి సత్కారం పొందడం వల్ల వచ్చిన మెడ నొప్పి ఇది.

రెండు వారాలు ఎక్కడికీపోకుండా ఇంట్లోనే కూర్చుని ఉండి కవితలు రాసుకోండి. మాత్రలు కానీ ఇతర ఏ వైద్యం కానీ అక్కరలేదు' అని సలహా ఇచ్చాడు.

'ఇంట్లోనే ఉండి కవితలు రాసుకోమంటున్నారు, అవి చదివి నాకు వినిపించే ప్రయత్నం చేస్తారు. నా మీద నీకు జాలి లేదా డాక్టర్' అన్నట్లుగా పద్మావతి, డాక్టర్ కేసి చూసింది.

ఆమె చూపుల్లో అంతరార్థం తెలుసుకున్న డాక్టర్ 'మీరు కవితల్ని రాసేటప్పుడు గది తలుపులు వేసుకుని రాయండి. అద్దం ముందర నిలబడుకొని పాడుకోండి. అంతా సర్దుకుంటుంది' అన్నాడు. అందరూ గట్టిగట్టిగా తలలూపారు.

వారానికంతా రామమూరినత 'మెడ నొప్పి', పద్మావతి 'తలనొప్పి' తగ్గాయి. ఇద్దరూ నవ్వుకుంటూ కొడుకుతో కలిసి డాక్టర్ దగ్గరికి వెళ్లి ఫలం, పుష్పం ఇచ్చి వచ్చారు. •


**ఆర్.సి.కృష్ణస్వామి రాజు**

దక్షిణ భారతావనిలో, తమిళనాడు తిరుణల్వేలిలో సాధు వారద రాజం, భూమి పుత్రులుగా ఇంటిపేర్లు లేకపోయినా, 'తల్లిపలుకు' కోసం ఉద్యమ స్వరూపంగా ఇంటిభాషగా మాతృభాషను ఆరాధించుకొన్న దశాబ్దాలు కాలగతిలో కలిసి పోతున్నాయి. ఎందరికో స్ఫూర్తి ప్రదాతలుగా, తెలుగు భాషాభివృద్ధి లక్ష్యంగా భాషోద్యమ సంఘాలు వెల్లివిరిసిన రోజులు కనుమరుగవుతున్నాయి

# తెలుగు-తమిళ సాహితీ బాంధవ్యం

జయసూర్య

పొట్ట చేత్తో పట్టుకొని, బతుకు తెరువు కోసం ఖండాంతరాలకు తరలి వెళ్ళిన తెలుగు సామాన్య జనావళి, తమకు జన్మతః ప్రాప్తించిన ఉనికి, వదులుకొని ఆ దేశాల, జాతుల సంస్కృతి, భాషా, నాగరికత అలవరచుకొని అంతర్భాగంగా కలిసిమెలిసి బతకక తప్పటంలేదు. అమెరికా వంటి సంపన్న దేశాలలో తెలుగు సంఘాలు ఉన్నా ఒక్కో సామాజిక వర్గం ఒక్కో సంఘంగా ఏర్పడి, ఆధిపత్యం కోసం, ఆరాటం కొనసాగుతోంది. పరాయి పాలనలో, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభంలో భాషను పట్టించుకొనే పరిస్థితి లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే, భాష, కులాలకు అతీతంగా వ్యవహరించి, ఐక్యత సాధించ లేని పరిస్థితి తల ఎత్తింది. స్వంత రాష్ట్రాలలో తల ఎత్తిన రాజకీయకుల ప్రోద్బలం, వైషమ్యం శృతిమించి కుల సంఘాలు తామరతంపరగా పుట్టుకొస్తున్నాయి. రాజకీయ అధికారం కోసం నిరంతరం తపించే నాయకమ్మలు నిస్సిగ్గుగా కులసంఘాల, కులపెద్దల ఆదరాభిమానాలు బాహాటంగా ప్రదర్శిస్తూ, వారు సంపన్నులైతే అధికారం, పదవులు కట్టబెడ్తూ పబ్బం గడుపు కొంటున్నారు. సాంకేతికంగా, సామాజికంగా, నాగరికతాపరంగా, ఎంతపురోగతి సాధించినా, గిరిగీసుకొన్న సంకుచిత వైఖరులు, కులాల కుంపటి రగిలించడం తప్ప భాషైక్యత పట్టించుకొనే స్థితిగతులు లేవు. ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక, ఆ ప్రాంతాలలో కుల ప్రాబల్యం, ధన ప్రోద్బలం ఓటు విలువను కాటేస్తున్నాయి. పాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన రాష్ట్రాలు, అత్యంత ఆధునిక సాంకేతిక ప్రజ్వలనం, ప్రపంచీకరణ, ప్రపంచాన్ని అతిదగ్గర చేయడం, రాష్ట్రాలలో కూడా హద్దులు చెరిగి పోతుండటంతో, మాతృభావనలు తీవ్రంగా విస్మరించబడటం ప్రపంచ నైజం అయింది. ప్రస్తుత సామాజిక, పాలనా ధోరణులలో భాష, రాజకీయ నాయకులకు కేవలం జూదంలో పాచికగా పరిణమించింది.




అవసరంలేని సమయంలో ఆ ఊసు ప్రసక్తి ఉండదు. ఇటువంటి స్థితిగతులలో తెలుగును గురించి, తెలుగు సాహిత్యం, కోట్లాది భారత జనావళిలో జాతీయ భాషగా హిందీ తర్వాత కనీసంగా తమిళ, బెంగాలీ వంటి భాషల సరసన తెలుగు ప్రతిష్టింపచేసే ఆదర్శం ఆచరణ యోగ్యంగా రచయితలు, భాషా ప్రేమికులు, అభిమానులు ప్రభుత్వాల్ని కదలించాలి. దక్షిణ దేశంలో పుట్టి, మహారాష్ట్ర రాజాస్థానాల కాలంలో జీవించిన త్యాగయ్య తన కీర్తనలను అద్భుతంగా సంగీత సరస్వతికి నేటికీ ఆరాధ్యనీయంగా తెలుగులో వెలువరించడం అత్యంత ఆశ్చర్యకరం. తంజావూరు ఆంధ్రనాయక రాజుల చారిత్రక నేపథ్యంలో తెలుగు భాషా బీజం అన్యభాషా, సంస్కృతి వాతావరణంలో సైతం అంతతైన శాస్త్రీయ స్రవంతి, తమిళులకు మాత్రమే కాకుండా యావద్భారతంలో సంగీత గాన సుధకు ఆలంబనమైంది. మన మాతృభాషలో ఎంతటి సుమధుర మృదుత్వం లేకపోతే ఇది సాధ్యం కాగలదు?

అదే విధంగా పదకవితా పితామహుడు అన్నమయ్య, సిద్ధహస్తుడైన క్షేత్రయ కృష్ణా ప్రాంతం మొవ్వ నుంచి పదకవిత్వాన్ని వెంటపెట్టుకొని నానాదేశ సంచారం చేసాడు గోల్కొండ వెళ్ళాడు. తంజావూరు విజయరాఘవ నాయకుని ఆస్థానాన్ని దర్శించాడు. తంజావూరు రాజ్యం అంతరించిన తర్వాత కూడా తెలుగు భాష మహోన్నతత ఆగలేదు. తంజావూరును పాలించిన మహారాష్ట్ర రాజులు తెలుగుకు పట్టం కట్టారు. తంజావూరు సరస్వతీ మహల్ నిర్మించి, మనకు సాహితీ బిక్ష ప్రసాదించారు. అమూల్యమైన నాటి తాళపత్ర గ్రంధాల సంపద పదిలపరిచిన మహారాష్ట్ర రాజు శహాజీ, (1684-1712) తెలుగులో 20 గ్రంథాలు రాసాడు. తర్వాత 200 సంవత్సరాలు మదుర రాజులు (1539-1736) ఆంధ్రనాయకులుగా పాలించారు. పద్యకావ్యాలు మాత్రమే కాకుండా ఆరోజులలో తెలుగులో వచన కావ్యాలు, విజయరంగ చొక్కనాధుడు రచించాడు. ఆంధ్రభాష నాటి సామ్రాజ్య భాషగా గౌరవింప బడింది. పుదుక్కోట సంస్థానాధీశులు ఆంధ్రులుకారు. తమిళులు. అయినా తమిళరాజులు సైతం తెలుగును అందలం ఎక్కించారు. పుదుక్కోట సంస్థానాధీశుడు రాయ రఘునాధుడు పార్వతీ పరిణయం అనే కావ్యం వ్రాసాడు. దక్షిణాంధ్ర సాహిత్యంలో 'పచ్చకప్పురపు తిరువేంగళకవి' రచించిన చొక్కనాథ చరిత్ర తొలిగా గుర్తించబడింది. దక్షిణాంధ్ర సాహిత్యంలో మహిళలు అత్యంత ప్రధానంగా నాటి శృంగార విదుషీమణులు, మహాపండితులుగా తెలుగు సాహిత్యాన్ని చిరఃస్మరణీయం చేసారు. రామభద్రాంబ, మధురవాణి, రంగాజమ్మ, ముద్దుపళని వీరంతా మన మాతృభాషకు తెలుగు మాధుర్యానికి ఎల్లలు, హద్దులు లేవని చాటి చెప్పారు. నాటి మహిళా మణులు కొందరు శృంగారం ప్రత్యేక లక్షణంగా రాసినా, సహజంగా పాత్రోచిత భాషాను ఎల్లా వినియోగించి సృష్టించారో రంగాజమ్మ రాసిన 'మన్నారు దాస విలాసం' నాటకంలోని సంభాషణలు తెలియచేస్తున్నాయి.

## 'పాటల పక్షి'



కోయిల రంగు నల్లనిదైతేనేం?
పాడే రాగం పంచమ శృతిలోలోకం
పరవశం!!
ఆహా! వశీకరణ రాగం
రాగ యోగం !

ఎవరు నేర్పింది కాదు!
నేర్చుకున్నది కాదు !
పుట్టుకతోనే పాటల పక్షి !!
పూట పూట కూయనిదే కోకిలకు
చిగుర్లు కడుపులోకి దిగవు !!

ఈ వసంత ఋతువులో కోయిల
అలసిపోక ఎన్నెన్ని వేల పాటలు
పాడుతుందో!
ఏ సన్మానం ఆశించదు!
తన కూత విని ఆనందంతో
పిల్లల కొట్టే చప్పట్లు ఘన సన్మానం
సందడి కోకిలకు

**- కందాళై రాఘవాచార్య**

### ఆశల సౌధం

దారి నిండా ముళ్లు పడుంటే..
పాదాల గీతల్లో రక్త క్షేత్రాన్ని దర్శించావ్
తొందరలోనే వెలుగు వస్తుందని
గుడి గోడలతో మొరపెట్టుకున్నావ్.

సహనపు కాగడానెత్తి,
గమ్యాన్నే చూస్తూ కదిలావ్.
గాలికి పోయిన నావలా ఒంటరిగా
నింగిని చూస్తూ నేలకి మొక్కావ్,

సముద్రపు గుండెల్లో
ఆత్మకు భరోసా లేకుండా పోయింది.
ఇక్కట్ల ఇరుకులో ఉడిగిపోతూ,
జీవం అడుగంటుతోంది.

తీరాన అంగలు తడబడ్డాయి
నీలో నీవు లేవిప్పుడు
ఆశల సౌధం అందమై,
రేపటి వెలుగుకై కళ్ళు కొరుకుతోంది.

తీరానికి కష్టానికీ మధ్య
ఆశే నిన్ను రక్షిస్తోంది.

**- బాలాజీ పోతుల**

## కొత్త పరిమళం

ఏమిటీ ఈ వింత రాత్రులు?
నిద్రను బయటకి నెట్టేయాలని
కంటితో యుద్ధమా?
రక్తపు మడుగులో
మానని గాయాలతో
విరిగిన మాటల మధ్య ఒరిగిన కలకు
విలువ గల ఒక్క పదంతో
కట్టుకట్టినా చాలు
ఒడిన ఊహకు ప్రాణం పోసి
నలిగిన మనసులో
మొన్నటి ప్రేమను వెతికి అప్పచెబితే
కొత్త పరిమళం ఉదయించినట్టే

**- చందలూరి నారాయణరావు**

## చివరి గుర్తు

గాలి ఈల వేస్తూ సవ్వడి
చేస్తే నువ్వొచ్చావనుకున్న
ఆకుల అలజడి
చూస్తే నీ నెమలి
నడక అనుకున్నా
కోకిల కూత వేస్తే
నువ్వు పిలిచావనుకున్నా
గుండె చప్పుడు
కూడా లయ తప్పి
నీ చూపుల చుట్టూ
చక్కర్లు కొడుతూ
కొత్త రాగమేదో
పరవశంతో పాడుతుంది
చంద్రుడు చిక్కిపోతే
నీ అలక అనుకున్నా
తారలు వెలుగుతుంటే
అది నీ నవ్వనుకున్నా
పువ్వులన్నీ అరవిరిసి
నవ్వుతుంటే అది
నీ మోమనుకున్నా
గాయమైన గుండె
నీ రాకకై విరహంతో
మూలుగుతుంటే
అది నువ్వు మన
ప్రేమకు మిగిల్చిన
చివరి గుర్తు

**- శ్రిష్టి**

## కవిత్వం

## కన్నీళ్ల వంతెన

రోజులన్నీ ఒకేలా వుండవు
అనుకోని సందర్భం లోంచి
నా కలల సామ్రాజ్యంలోకి
కన్నీళ్ల గేట్లు తెరుచుకున్నాయి

ఇక్కడ ఉన్నదీ సైనికుడు
సంకల్పంతో యుద్ధం చూస్తూనే ఉన్నాడు

గెలవడానికి ఒకింత ఓదార్పు
మరింత నేర్పు కాలంతో పోరాడాయి

ఎన్ని ముచ్చట్లు కోల్పోయినా



ఎన్ని చీకట్లు కట్టు తెంచినా
బలాన్ని ధైర్యంగా ముందుకు
నడవటంతోనే యుద్ధం మొదలైంది.

వెన్నెల్ని చూడటం అలవాటైనపుడు
కన్నీళ్ల దృశ్యాల్ని చూడాలనుకోరు

కష్టం ఆవలి ఒడ్డున
విజయం పిలుస్తోంది
మరో శిఖరం అధిరోహించమంటోంది.

మనవి కాని కాలాలు
మనల్ని కొన్ని తడుతుంటాయి

దిగుల్ని దిగమింగుకుంటూ
సాధించిన విజయాలపై నిలబడి
ఆనందాన్ని రెపరెపలాడించడమే కదా జీవితం

కన్నీళ్ల వంతెన దాటడం
నమ్మకాన్ని పునాదులు చేసుకుని గెలవడం
ఓడినా గెలిచినా దూసుకు పోవడం
లక్ష్యాన్ని ఛేధించటం

క్షణాల్ని మెరిపించే ఆకాంక్షే
జీవితాన్ని వెలిగిస్తూ నడిపిస్తుంది.

**- గవిడి శ్రీనివాస్**

సమోసా ఎప్పుడూ ఒకేతీరేనా? అంటే ఇలా వెరైటీగా ప్రయత్నించొచ్చు. ఆలు తో చేస్తే.. పొట్ట నిండాల్సిందే! చికెన్‌తో కలిపితే చిటికెలో ప్లేట్ ఖాళీ.. కూరగాయలు కూరితే మనం ఆవురావురుమన్నాల్సిందే.. ఆ రుచికి సాగిలపడాల్సిందే.



# సమోసా రచులు

## ఆలూతో..

**కావాల్సినవి:** తగిన ఉల్లిపాయ-ఒకటి, తరిగిన పచ్చిమర్చి-మూడు, అల్లం తరుగు-చెంచా, ఆలూ-ఆరు, బఠాణీలు-పావు కప్పు, జీలకర్ర-అర చెంచా, కాజూ-గుప్పెడు, కిస్‌మిస్-ఏడెనిమిది, గరంమసాలా, చాట్ మసాలా-చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, నూనె-వేయించడానికి సరిపడా.



**తయారీ :** ఆలుగడ్డలను శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేయాలి. ఇందులోనే బఠానీలను వేసి నాలుగైదు కూతలు వచ్చేవరకు ఉడికించాలి. ఇప్పుడు వీటిని చల్లార్చి పొట్టుతీసి మెదిపి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి నూనె పోయాలి. అది వేడయ్యాక జీలకర్ర, కాజూ కిస్‌మిస్ వేసి వేయించాలి. ఇప్పుడు ఉల్లిపాయ, పచినచమర్చి ముక్కలు, అల్లం తరుగు కూడా కలిపి మరికాసేపు వేయిస్తేసరి. ఉల్లిపాయలు కాస్త గోధుమ రంగులోకి వచ్చిన తర్వాత ఉడికించిన ఆలూ, బఠాణీలు కూడా వేసి కలపాలి. దీంట్లో గరంమసాలా, చాట్ మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. అంతే సమోసాలకు మసాలా కూర సిద్ధమైనట్లే. ఈ కూరను నత్రికోణాకారంలో చుట్టుకున్న చపాతీలో పెట్టి అంచులు మూసే యాలి. వీటిని కాగే నూనెలో వేసి బాగా వేయించు కోవాలి. నరగీన్ చట్నీ టొమాటో సాస్‌తో తీసుకుంటే బాగుంటాయి.

## చికెన్‌తో...

**కావాల్సినవి :** చికెన్ ముద్ద- 200గ్రా, నూనె-మూడు చెంచాలు, తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చొప్పున, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా, పసుపు-పావు చెంచా, కారం- చెంచాన్నర, గరంమసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి-అరచెంచా చొప్పున, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కాస్తంత, నిమ్మ రసం- రెండు చెంచాలు.

**తయారీ:** పాన్‌లో నూనె పోసి వేడయ్యాక ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. అల్లం వెల్లుల్లి ముద్ద జత చేయాలి. ఆ తర్వాత చికెన్ వేసి కలపాలి. దీంట్లో కారం, పసుపు, ధనియాల పొడి, గరంమసాలా, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. చికెన్ ఉడికిన తర్వాత చివరగా కొత్తిమీర తరుగు వేసి కలిపేయాలి. ఈ మిశ్రమాన్ని వేరొక గిన్నెలోకి తీసుకుని చల్లార్చాలి. ఇప్పుడు చపాతీ పిండిని తీసుకుని కోడిగుడ్డు ఆకారంలో కాస్త మందంగా పూరీలా చేసుకోవాలి. దీంట్లో చికెన్ మిశ్రమాన్ని కూర్చి సమోసాలా చేయాలి. ఇలా తయారుచేసి పెట్టుకున్న సమోసాలను వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. వీటిని టొమాటో కెచప్‌తో తీసుకుంటే చాలా రుచిగా ఉంటాయి.

## చీజ్‌తో ..

**కావాల్సినవి :** ఉడికించిన బంగాళా దుంపలు- రెండు, ఉడికించిన స్వీట్‌కార్న్- కప్పు, చీజ్ తురుము- 100 గ్రా, అల్లం తరుగు-చెంచా, తరిగిన పచ్చిమిర్చి-మూడు, కారం, జీలకర్రపొడి, చాట్ మసాలా- చెంచా చొప్పున, ఉప్పు-తగినంత, నిమ్మరసం-రెండు చెంచాలు కొత్తిమీర తరుగు-కొద్దిగా.




**తయారీ :** పెద్ద గిన్నె తీసుకుని పై పదార్థాలన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసుకుంటూ బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని సమోసా ఆకారంలోచేసిన చపాతీలో పెట్టి అంచులుమూసే యాలి. దీన్ని వేడి వేడి నూనెలో మంటను మధ్యస్థంగా పెట్టి లోపలి పదార్థాలనీ ఉడికేలా చేయించుకోవాలి.

# పుస్తకం
# మస్తిష్క వికాస సాధనం!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

**చదివి అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెడితే మీ వ్యక్తిత్వం మరింత ఇనుమడిస్తుంది. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం కూడా అని గుర్తుంచుకోవాలి.**

**నేటి డిజిటల్** యుగంలో "లుకింగ్ కల్చర్ పెరుగుతూ, రీడింగ్ కల్చర్ సన్నగిల్లుతోంది". చదవడం అనే కళ క్రమంగా కళావిహీనం అయిపోతున్నది. చదవడం అంటే తెలియని విషయాలను తెలుసుకోవడం, అజ్ఞాన చీకట్ల నుంచి జ్ఞాన వెలుగుల వైపు అడుగులు వేయడం.



చదవడానికి ఏకాగ్రత, తపన కావాలి. చదవడాన్ని అమితంగా ఇష్టపడితే ఏకాగ్రత దానంతట అదే వస్తుంది. స్మార్ట్ ఫోన్ వచ్చాక సామాజిక మాధ్యమాల్లోంచి బయట పడడం అసాధ్యంగా తోస్తున్నది. ప్రతి నెల లేదా సంవత్సరంలో ఇన్ని పుస్తకాలు చదవాలనే నియమం పెట్టుకోవాలి. పుస్తకాలు కొనడం అలవాటు చేసుకోవాలి. ప్రపంచ పోకడలకు అనుగుణంగా మనం ఎదగడానికి అవసరమైనది చదువు అని నమ్మాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాల చదువుకు తప్పనిసరిగా సమయం ఇవ్వాలి. వారు ఇతర ఆసక్తిగల అంశాలకు సంబంధించిన పుస్తకాలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలి. "స్వానుభవంతో నేర్చుకున్న వారు అవివేకులు, ఇతరుల తప్పుడు అనుభవాలతో నేర్చుకున్న వారు వివేకవంతులు" అనే నినాదం విన్నాం.

"నేను పుస్తకాలు కొన్న తర్వాత డబ్బు మిగిలితేనే తినుబండారాలు కొంటాను" అనే సూత్రం పాటిస్తూ పుస్తకాలు కొనడానికి, వ్యక్తిగత లైబ్రరీ నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. చదివితే తెలివి పెరుగుతుంది, మెదడు చురుకుగా పనిచేస్తుంది. తెలివితో సరైన ఉద్యోగం, సమాజంలో గుర్తింపు దొరుకుతాయి. ఉద్యోగంతో జీవితంలో స్థిరత్వం పెరుగుతుంది. స్థిరత్వంతో పౌర సమాజంలో మంచి గౌరవం లభిస్తుంది. పుస్తకాలు కొనడం, చదవడానికి సమయం ఇవ్వడం మంచి ప్రతిఫలాలను, జీవన సాఫల్య ఫలితాలను ఇస్తుందని పుస్తకాలు కొని చదవకపోయిన యెడల మనం వెచ్చించిన ధనం వృథా అవుతుంది. ఇంట్లో పుస్తకాలు ఉంటే రోజు ఒకటి లేదా రెండు గంటలైనా చదవడం మంచిదని గమనించాలి. ప్రతి ఏట వంద వరకు పుస్తకాలు చదువే విధంగా మన జీవనశైలి ఉండాలి. వారాంత సెలవుల్లో చదవడానికి కొంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

మీ జీవనశైలిని బట్టి చదవడానికి సమయం కేటాయించాలి. మీరు ఎక్కువగా ప్రయాణాలు చేసేవారయితే ప్రయాణ సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించవచ్చు. బిడ్డకు పాలు పట్టే తల్లి కూడా పుస్తకాలను చదవవచ్చు. మనం తినేటప్పుడు, కార్యాలయాల్లో, పని ప్రదేశంలో, చివరికి వాష్ రూమ్‌లో కూడా ఆసక్తిగల వారు చదవవచ్చు.

వారానికి సగటున 10 గంటలు చదివే అలవాటు ఉన్న వారు ఏడాదికి దాదాపు వంద పుస్తకాలు చదవవచ్చు. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్ టాప్ తెరలపై సమయాన్ని వృథా చేయడం కన్న పుస్తక పఠనానికి అధిక సమయం ఇవ్వడం సముచితంగా ఉంటుంది. అందరు అన్ని రకాల పుస్తకాలను చదువలేరు. మనకు ఆసక్తి ఉన్న రంగాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం మనకు ఇష్టంగా ఉంటుంది. ప్రముఖుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, సమకాలీన సమస్యల గూర్చి చర్చించే పుస్తకాలు, మనం ఎంచుకున్న రంగానికి లేదా వృత్తికి సంబంధించినవి, ప్రముఖ నవలలు, పేరెన్నికగన్న రచనలు లాంటివి ఏవైనా చదవవచ్చు. కౌమార దశ నుంచే చదవడాన్ని ముఖ్య అలవాటుగా చేసుకోవాలి. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ఒక మంచి అలవాటు. పుస్తకాలు చదివేటప్పుడు ముఖ్యమైన విషయాలను నోట్ చేసుకోవడం మరువ రాదు. పాక్షికంగా చదివిన పుస్తకం పేజీని పేపర్ ముక్క పెట్టి లేదా పేజీ మూల మలిచి గుర్తుంచు కోండి. మనకు నచ్చిన కొటేషన్లను నోట్ చేసుకోవాలి. చదవడానికి నియమ నిబంధనలు, సరైన సమయ సందర్భాలు అనేవి ఏవీ ఉండవు. పాఠకుడికి ఆసక్తి ఉంటే ఎడారిలో లేదా ఎండల్లో కూడా చదవవచ్చు. చదవడం వల్ల మనో విస్తృతి పెరుగుతుంది. సమాజం లోతులు అర్థం . ఆత్మ విశ్వాసం అపారంగా పెరుగుతుంది. ప్రజాదరణ పెరుగుతుంది. పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. చదివి అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెడితే మీ వ్యక్తిత్వం మరింత ఇనుమడిస్తుంది. పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాస సాధనం కూడా అని గుర్తుంచుకోవాలి. చదువును దుకాణంలో కొనడాని వీలు కాకపోవచ్చు, కాని పుస్తకాన్ని చదివి జ్ఞానాన్ని ఆర్జించవచ్చని మరిచి పోరాదు.

ఎండాకాలంలో చిన్నారులు ఆటల్లో పడి ఎండ తీవ్రత తమపై పడుతుందన్న విషయాన్ని గమనించరు. ఫలితంగా డీహైడ్రేషన్ పెరిగింది. అలాగని చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే ఆటల నుంచి వారిని దూరం చేయలేం కదా.. అందుకే ఎండ ప్రభావం వారిపై పడకుండా.. వారు డీహైడ్రేషన్‌కి గురికాకుండా.. కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఇవి డీహైడ్రేషన్ లక్షణాలు.. అధిక చర్మంలోనూ శరీరం చల్లగా ఉండేందుకు అధిక మొత్తంలో చెమటను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఇలా చెమట ద్వారా శరీరంలోని నీరు, లవణాలు అధికమొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్‌కి



# డీహైడ్రేషన్‌కి దూరంగా..!



గురవుతుంది. వేసవిలో చిన్నారులు డీహైడ్రేషన్‌కి వస్తున్న సూచన మనం ముందుగానే గుర్తించవచ్చు. నీరసంగా కనిపించడం, నోరు పొడిగా తయారవడం, మూత్రవిసర్జన తక్కువగా ఉండటం, వాంతులు చేసుకోవడంతో పాటు చిరగ్గా ఉన్నట్టు కనిపిస్తే.. వారు డీహైడ్రేషన్‌కి కనిపిస్తున్నట్లుగా గుర్తించాలి. ఈ సమయంలో వారిని ఆటలకు కాస్త బ్రేక్ ఇవ్వమని చెప్పి నీరు, మజ్జిగ, పండ్లు వారికి అందించాలి. అవసరమైతే సంప్రదించాల్సి ఉంటుంది. శరీరం నుంచి చెమట ద్వారా బయటకు వెళ్లిపోయిన నీటి లోటును పూర్తిగా భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే చిన్నారులకు దాహం వేస్తున్నా. ప్రతి పావుగంట నుంచి ఇరవై నిమిషాలకోసారి గ్లాసు నీటిని తాగమని వారికి అందించాలి.ఎప్పుడూ నీటిని తాగడానికి చిన్నారులు అంత ఆసక్తి చూపించలేరు. అందుకోసం మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, కీరాపండ్ల ముక్కల్ని నీటిలో వేసి అందించడం అలాగే నీటిశాతం ఎక్కువగా ఉన్న పుచ్చ, తర్బూజా లాంటి పండ్లను కూడా వారికి అందించాలి. వేసవిలో కూల్‌డ్రింక్లను చిన్నారులకు అందించడమే మంచిది. ఎందుకంటే వీటిలో ఉండే కెఫీన్ సహా ఇతర పదార్థాలు చిన్నారుల్లో డీహైడ్రేషన్‌కు కారణమవుతాయి.

వేసవిలో ఎక్కువ సమయం ఆటల్లోనే గడిపే చిన్నారుల వస్త్రధారణ విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. చాలా వరకు వారికి లేత రంగుల్లో ఉన్న నూలు వస్త్రాల కోసం తొడగాలి. అవి కూడా వదులుగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక స్థాయి ప్రభావం వారిపై పడకుండా ఉంటుంది.

నాలుగు నుంచి ఐదు గంటల పాటు ఏమీ తినకుండా, తాగకుండా చిన్నారులు ఉన్నట్లైతే వారికి డీహైడ్రేషన్‌కి అవకాశం ఉంది. కాబట్టి వారికి సరైన సమయానికి ఆహారం, నీరు అందించాలి.

# షుగర్ తగ్గుతుంది!



మీరు ఇప్పుడే భోజనం చేశారు అనుకుందాం. మనం తిన్న ఐదారు నిమిషాల్లోనే జీర్ణాశయం గ్లూకాన్ లైక్ పెప్టయిన్ (జీఎల్పీ1) అనే హార్మోన్ స్రవిస్తుంది. అది ఆహారం నుంచి ఎక్కువ గ్లూకోజ్ ఉత్పత్తి చేయకుండా కాలేయాన్ని అదుపు చేస్తుంది. ఉత్పత్తయిన గ్లూకోజ్ రక్తంలో మరీ ఎక్కువగా చేరకుండా ఇన్సులిన్ విడుదల చేయబద్ధ పాంక్రియాస్ (క్లోమగ్రంథి)ని ఆదేశిస్తుంది. అక్కడితో ఆగదు. 'కడుపు నిండిపోయింది. ఇంకేమీ తినలేనబ్బా' అన్న ఫీలింగ్ కలిగింది. ఈ కీలక పనులన్నీ చేసే 'జీఎల్పి1' హార్మోన్ స్రావం మందగించడం వల్లే మధుమేహం వస్తుంది. ఈ సమస్య కోసం ఇప్పుడువాడుతున్న 'ఒజాంపిక్' వంటి మందులు. జీఎల్పీ1 చేయాల్సిన పనులను కృత్రిమంగా చేస్తున్నారు. ఆ మందులతో పనిలేకుండా జీఎల్పీ1ని సహజంగా పెంచే అవకాశం ఉందా.. అని శాస్త్రవేత్తలు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. చైనాలోని జియాంగ్‌ష్నాన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఆ దిశగా ముందడుగు వేశారు. జీఎల్పీ1 హార్మోన్కి... జీర్ణ వ్యవస్థలో ఉన్న బి.వల్గటాస్ అన్న కంటికి సంబంధం ఉందని కనిపెట్టారు. 'బి' వల్గ టాస్ ప్రదర్శన ఉన్న వాళ్లలో... చక్కగా అదుపులో ఉండటం గమనించారు. మరి ఈ బి. వల్గటాస్ని సహజంగా పెంచడం ఎలా అని చూస్తే ఎఫ్‌పార్సి అనే ప్రోటీన్‌లో ఇవి పెరుగుతున్నట్టు గమనించారు. ఈ ప్రోటీన్ ఆహారం ద్వారా పెంచగలిగితే.. మధుమేహాన్ని తగ్గించొచ్చని చెబుతున్నారు.

## కథ

# జింక గర్వభంగం

అనగనగా ఒక అడవి. ఆ అడవి పచ్చ పచ్చని బయళ్ళతోను, అందమైన సరస్సులు, పూల మొక్కలతో అలరారు తుండేది. తరతరాలనుండి వస్తున్న జంతు, వృక్ష సంపద ఆ అడవి సొంతం. ఆ అడవిలోని జంతువులు ఒకరికి ఒకరు అన్నట్టు జీవనం సాగించేవి. ఎవరికీ ఏ చిన్న కష్టం వచ్చిన తమ కష్టమనుకుని మిగిలిన జంతువులన్నీ సాయపడేవి. ఇలా అడవి జంతువులన్ని సుఖంగా, సంతోషంగా జీవనం కొనసాగించేవి.



ఆ అడవిలో ఒక జింక ఉండేది. అది చాలా పొగరుబోతుది. తన అందం చూసుకుని తెగ మరిసిపోయేది. దేవుడు తన ఒక్క దానికే ఇంత అందమిచ్చాడని తనేంతో అదృష్టవంతురాలని పొంగిపోయేది. తనకు మిగిలిన జంతువులు సాయం చేయడం వాటి అదృష్టమని భావించేది. సాయం పొందిన తాను ఇతర జంతువులకు సాయపడటం నామోషీగా అనుకునేది. ప్రతి రోజు అడవిలోఉన్న సరస్సులో తన అందాన్ని తనివి తీరా చూసుకునేది. సరస్సుకు నీళ్లు తాగటానికి వచ్చిన ప్రతీ జంతువుకు తన అందం గూర్చి చెప్పేది. ఆపదలో ఉన్న జంతువులను కనీసం పరామర్శించేది కాదు. ప్రతి నిమిషం తన అందాన్ని పొగుడుకునే జింక తీరు మిగిలిన జంతువులకు విసుగు కలిగి మృగరాజు సింహానికి మొర పెట్టుకున్నాయి. జింకకు ఎలాగైనా బుద్ధి చెప్పమని కోరాయి. సింహం ఆలోచించి అడవిలో అందాల పోటీలు ప్రకటించింది. న్యాయ నిర్ణేతగా ఏనుగును నియమించింది. చీమ మొదలుకుని అడవిలో గల సర్వప్రాణులు ఈ అందాల పోటీలో పాల్గొన వచ్చుని ఏనుగు వివరించింది.ఈ అందాల పోటీకి అడవిలోని సమస్త జంతువులు తరలి వచ్చేయి. జింకతో పాటు ఒక కోతి కూడా ఈ పోటీకి బయలు దేరింది.మార్గం మధ్యలో ఒక కుందేలు ఏడుస్తూ కనిపించింది. జింక ఆ కుందేలును పట్టించుకోకుండా ముందుకు కదిలింది. కోతి ఆగి కుందేలు బాధకు కారణం అడిగి తెలుసుకుంది. కుందేలు తన భర్త, పిల్లలకు జ్వరమని తినటానికి ఏమీ లేదని అన్నది. కుందేలు కోతి సాయంతో భర్త, పిల్లలను వైద్యుడుకి దగ్గరికి తీసుకెళ్ళింది. ఆహారంగా తన వెంట తీసుకువెళుతున్న పండ్లు ఇచ్చింది కోతి. కుందేలుకు ధైర్యం చెప్పి అందాల పోటీకి బయలు దేరింది. అందాల పోటీ ప్రారంభం అయింది. కోతి ఆలస్యంగా వచ్చింది. ఆలస్యానికి కారణం అడిగింది ఏనుగు. జరిగిందంతా చెప్పింది కోతి. కోతిని మెచ్చుకుని అందాల పోటీలో విజేతగా ప్రకటించింది ఏనుగు. "అందమంటే మంచి మనసు ఉండడం. సాయం చేసే గుణం ఉండడం. ఆ గుణాలు కోతికున్నాయి. అందుకే విజేతగా నిలిచింద"ని ఏనుగు అన్నది. సింహంతో పాటు అన్ని జంతువులు చప్పట్లతో తమ ఆనందం వ్యక్తం చేశాయి. ఇన్నాళ్లు అందగత్తె ననుకున్న జింక గర్వమణిగి, బుద్ధి వచ్చింది.ఇక అక్కడ నుండి పరోపకారం చేస్తూ జింక బతకసాగింది.

- రాళ్లబండి సంగం నాయుడు



రంగులు వేయండి



వార్త ఆదివారం

## బాలగేయం

### 'ఓ జ్ఞాన దంతమా'!

ఓ జ్ఞాన దంతమా
చివరికి వచ్చే చిగురింతమా
నోటి కుహరములో
నాలుగు వైపుల
సరిహద్దంతమా!
ఇరవై ఎనిమిది పళ్ళకు
తోడుగా
యుక్తవయసులో
వచ్చే విశేష
విజ్ఞాన సుజ్ఞాన దంతమా!
నువ్వు వస్తే పెద్దవారమై
పోతామా
హాయిగా ఆడుకునే
పిల్లలం కామా
నువ్వంటే జ్ఞానమే మా
సొంతమా !
హక్కుల్ లేదా బుద్ధి లేదా
హక్కుల్ దొడ రాలేదా
అని అందరూ తిట్టడమా!
నువ్వు వచ్చేటప్పుడు
నొప్పి నొప్పి
నువ్వూడిపోతే తొత్తి తొత్తి
మాకెందుకింత సుత్తి సుత్తి!
వైద్యులు నువ్వుత్తని పీకేస్తారు
వైద్యానికి నువ్వు అందవా
అందానికి అంత తగవా !
ఎంత నవ్వినా ఏడ్చినా
కనిపించని
ఓ జ్ఞాన దంతమా
వింతోదంతమా !

**- పి. బక్కారెడ్డి**

## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**ప్రశ్న:** వాన పడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?

**జవాబు:** వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారుతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా అధికంగా పరావర్తనం కనిపిస్తాయి. వాన పడే చెందదు. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువులు సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావరనతనం చెందదు. ఈ దృష్ట్యా, వాన పడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.

**ప్రశ్న:** ఆకాశం నుంచి జారిపడే వాన చినుకు వేగం ఏ స్థాయిలో ఉంటుంది?



**జవాబు:** మేఘాలలోని నీరు వర్షంగా మారినప్పుడు భూఆకర్షణశక్తికి గురవుతుంది. ఎంత ఎత్తులో నుంచి కిందకు పడినా భూమి తన పరిధిలోని వస్తువు లేదా పదార్థాలను ఒకేవిధంగా ఆకర్షిస్తుంది. అంటే వాన చినుకు ఎంత ఎత్తు నుంచి పడినా దాని వేగంలో మార్పు ఉండదు. ఒకే వేగంతో పడతాయి. గాలి బలంగా వీచినప్పుడు, ఆ గాలి తాకిడికి వర్షపు చినుకులు వేగంగా దూసుకువచ్చినట్టుగా మనం భావిస్తాం. వాన చినుకు వేగాన్ని సెకనేకు 9.8 'న్యూటన్ మీటర్లు'గా పరిగణించారు. ఐజాక్ న్యూటన్ భూమ్యాకర్షణ శక్తిని కనుకొనడం వలన ఆకర్షణశక్తిని ఆయన పేరు మీద 'న్యూటన్ మీటరు'గా కొలుస్తారు.

**ప్రశ్న:** మేఘాలలో ఏమైనా రకాలు ఉన్నాయా?

**జవాబు:** మేఘాలు ఏర్పడే తీరుతెన్నులను అధ్యయనం చేసి వర్గీకరణ చేసారు. ముఖ్యంగా నింబస్, సిర్రస్, క్యుములస్ మొదలైన వివిధ రకాల మేఘాలు ఉన్నాయి.





**'అశ్విని' అతి** చిన్నవయసులోనే వ్యవసాయ పరిశోధనలో అద్భుత ప్రతిభ కనబరిచి, అయితే ఇప్పుడామె సజీవంగా లేదు. అయినా ఆమె పరిశోధనలో కనిపెట్టిన 'శనగ' వంగడం రైతు నోళ్లలో నానుతుంది. వారింట బంగారు సెనగ పంటలు పండిస్తోంది.తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) కొత్తగా ఆవిష్కరించిన 'పూస శనగ 4037' అనే వంగడానికి 'అశ్విని' అని పేరు పెట్టింది. ఈ నెల 14న ఢిల్లీలో ఐఏఆర్ఐ ఈ కొత్త రకాన్ని విడుదల చేసిన సందర్భంగా ఈ విషయాన్ని ఐ.ఎ.ఆర్.ఐ వెల్లడించింది.

# 'పూసా' పేరు 'అశ్విని'

# పేరైతే దక్కింది !



మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సరిహద్దు గ్రామమైన గంగారం తండాకు చెందిన



నూనావత్ అశ్విని, హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్యజయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లో జరిగే సెమినార్‌లో అవార్డు అందుకునేందుకు తండ్రి మోతీలాల్‌తో కలిసి స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ సమీపంలో ఆకేరు వాగు వరద ప్రవాహంలో వారు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో మోతీలాల్‌తో పాటు అశ్విని కూడా దుర్మరణం చెందారు. ఆ సెమినార్‌లోనే 'అశ్విని' అవార్డు అందుకోవాల్సి ఉంది. అవార్డు అందుకోకుం డానే అకాల మరణం పొందిన ఆమెకు గుర్తింపుగా కొత్త శనగ వంగడానికి అశ్విని పేరు పెట్టారు. అశ్వినికి గొప్ప గౌరవం లభించడంపై ఆమె కుటుంబ సభ్యులు, తండా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అశ్విని తల్లి నేజా మాట్లా డుతూ కొత్త వంగడానికి తన బిడ్డ పేరు పెట్టడంతో ఆమెకు శాశ్వతంగా నిలిచిపోతుందని చెప్పింది. తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలను కనుక్కుంటానమ్మా నా ఉద్యోగం అదే నన్ను వ్యవసాయ శాస్త్రవేత్త అంటారమ్మా అని నాబిడ్డ చెప్పింది. అని నేజా భావోద్వేగానికి గురైంది.

**చదువుల తల్లి:** అశ్విని చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. ఆమె 10వ తరగతి వరకు కారేపల్లిలో, ఇంటర్‌విజయవాడలో పూర్తి చేసింది. అగ్రికల్చర్ బీఎస్సీ అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో చదివి బంగారు పతకం సాధించింది. ఆ తర్వాత ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో పీజీ పీహెచ్‌డీ పూర్తిచేసింది. రాయ్‌పూర్‌లో శాస్త్రవేత్తగా పనిచేసిన ఆమె గత ఏడాది సోదరుడి వివాహ నిశ్చితార్థం ఉండడంతో స్వగ్రామానికి బయలుతేరి వచ్చింది. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆకేరు ప్రవాహంలో చిక్కుకుని తండ్రీ కుమార్తె మృతి చెందారు.

# తాగొస్తే విందు ఇవ్వాలి !

**ఎక్కడా లేని వింత ఆచారం ఇక్కడ చూస్తుంటాము.**

బంధుమిత్రులను పిలిచి భోజనాలు పెట్టడం అందరికీ తెలిసిందే. కానీ తప్పుచేసిన వాళ్లే ఊరందరినీ ఆహ్వానించి మటన్‌తో దావత్ ఇచ్చే వాళ్లని ఎక్కడైనా చూశారా?

గుజరాత్‌లోని బానాస్కాంఠా దగ్గరున్న ఖతిసితర గ్రామానికి వెళితే అలా విందు చేసే వాళ్లు కనిపిస్తారు. దాదాపు రెండువేల మంది ఉండే ఆ పల్లెలో మద్యానికి బానిసలై మరణించినవా ఎందరో. మద్యపానాన్ని నిషేధించాలని ఆ ఊరిపెద్దలు తలపోసారు. ఎవరు తాగినా వాళ్ల సొంత ఖర్చుతో ఊళ్లో వాళ్లందర్నీ మటన్ భోజనాలు ఏర్పాటు చేయాలని నిబంధన విధించారు. అంతమందికి విందు అంటే దాదాపు పాతిక వేల దాకా ఖర్చు అవుతుంది. అది భరించలేక చాలామంది మద్యం మానేశా ఒకప్పుడు 'ఖతిసీతం'లో వందల మంది తాగుబోతులు ఉంటే మూడేళ్లలో ఆ సంఖ్య పదికనా తక్కువకు చేరింది. అదే విధంగా ఆ దగ్గరలోని మోతిపుర గ్రామంలో మద్యం సేవించిన వాళ్లకు వేల రూపాయల జరిమానా విధిస్తారు. అలా వసూలు చేసిన డబ్బును మద్యంతాగి మరణించిన వారి పిల్లల చదువుకు ఆర్థిక సాయంగా అందచేయడం విశేషం.



# ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారా?

కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులిద్దరూ పిల్లలను వదిలి బయటకు వెళ్లాల్సి వస్తుంటుంది. ఇలాంటప్పుడు పిల్లలు కొన్ని సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఈక్రమంలో ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.

**పోస్ట్ చేయద్దు..**

కొంతమంది తాము చేసే ప్రతి పనిని ఇతరులకు తెలియజేయాలనే ఆత్రుతతో సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతుంటారు. ఒక్కోసారి ఇవే ప్రమాదకరంగా మారుతుంటాయి. ఇదే విషయాన్ని మీ పిల్లలకు తెలియజేయండి. మీరు మీ పిల్లలను ఇంట్లో వదిలి వెళ్లినప్పుడు వారు ఒంటరిగా ఉన్నారని తెలియజేసే విధంగా ఎలాంటి పోస్టులు పెట్టద్దని చెప్పండి. ఇలాంటిపోస్టులు పెట్టడం వల్ల కలిగే ప్రమాదాన్ని ఉదాహరణ రూపంలో వివరించండి.

**డోర్ తీయద్దు..**

సాధారణంగా పిల్లలను అపరిచితులకు దూరంగా ఉంచుతుంటాం. అలాగే వారు ఏది ఇచ్చినా తీసుకోవద్దని చెబుతుంటాం. ఇదే పద్ధతిని మీరు ఇంట్లో లేని సమయంలోనూ పాటించమని చెప్పాలి. అలాంటి వారెవరైనా వస్తే డోర్ తీయద్దని చెప్పాలి. దీనికోసం మీ ఇంటి చుట్టూ సెక్యూరిటీ కెమెరాలను పెట్టండి. ఇలా చేయడం వల్ల ఎవరు డోర్ బెల్ కొట్టారో ఆరు సులభంగా తెలుసుకోవచ్చు. అలాగే మీరు ఎక్కడున్నా సరే మధ్యమధ్యలో ఈ కెమెరాల మధ్య వాళ్లు ఎలా ఉన్నారో చెక్ చేయడం మర్చిపోవద్దు.

అత్యవసర



**నంబర్లు చెప్పండి...**

అత్యవసర పరిస్థితుల్లో ఎవరికి ఫోన్ చేయాలో ముందుగానే చెప్పండి. వాటిని ఎమర్జెన్సీ నంబర్లుగా వారి ఫోన్లో సేవ్ చేయండి. మీ సన్నిహితులు, ఇంటి పక్కన ఉన్నవారి నంబర్లను కూడా వారికి చెప్పండి.

ఎమర్జెన్సీ లైట్లకు ఎప్పుడూ ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలి. దానిని ఎలా ఉపయోగించాలో పిల్లలకు చెప్పండి. ఎప్పుడైనా కరెంట్ లేనప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది.

కొంచెం పెద్దవారైతే ఇంటర్నెట్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అలాంటి వారికి ఇంటర్నెట్ వాడకానికి సంబంధించిన జాగ్రత్తలను వివరించండి. ఫోన్‌లో లొకేషన్‌ని ఆఫ్ చేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను పంచుకోకుండా ఉండడం. వంటివి ఇందులో భాగమే.

పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకోవడం సహజంగా జరుగుతుంటుంది. ఒకవేళ ఈరు లేనప్పుడు ఇలా జరిగితే వారే సొంతంగా ఫస్ట్ ఎయిడ్ చేసుకునే శిక్షణ ఇవ్వండి. ఇది చాలా సందర్భాల్లో ఉపయోగపడుతుంది. ఇంట్లో ఉండే ముందులను వారికి దూరంగా ఉంచండి. ■

---




### అమ్మోయ్, బాబోయ్

రాజారావు : ఏమి, అప్పారావు నీ చేతికి కట్టుంది.

అప్పారావు : మా ఆవిడ కొట్టింది.

రాజారావు : మరి నువ్వేమి చేసావు?

అప్పారావు : అమ్మోయ్, బాబోయ్ అన్నాను.

### శోభనం గదిలో

భర్త : ఏమన్నా మాట్లాడు పద్మా

భార్య : మీ అమ్మని ఇంట్లోనుంచి ఎప్పుడు పంపుతారో చెప్పండి.

### గాయం

పేషంట్ : డాక్టరు గారు మీరిచ్చిన మందులకు జబ్బు తగ్గలేదు.

డాక్టర్ : తగ్గలేదా? కంగారు పడకు, అన్ని గాయాల్ని కాలమే మాన్పుతుంది.



### వర్షం

భార్య : ఎండాలేదు, వర్షం లేదు గొడుగు తీసుకెళ్తున్నారెందుకు?

భర్త : మొదటి భార్య రాధ కన్పిస్తుందేమోనని

భర్త : కాంతం, ఏం అనుకోకు ఆ రెస్టారెంట్ బర్యానీలా రుచిగా లేదు

భార్య : అవును, అది నాలుగు రోజులు ఫ్రిజ్‌లో పెట్టిన చికెన్‌తో చేసిన బిరియాని, ఇది ఫ్రెష్ చికెన్‌తో చేసిన బిరియాని

**- వైదా ఈశ్వర రావు, విశాఖపట్నం**

### ఎండలు బాబోయ్ ఎండలు

టీచర్ : చింటూ హోంవర్క్ చేసావా?

చింటూ : చేయలేదు టీచర్.

టీచర్ : అయితే అక్కడ ఎండలో గోడ కుర్చీ వేయ్.

చింటూ: అసలే ఎండా కాలం అక్కడ ఎండలో గోడ కుర్చీ వేస్తే మీరు మండుటెండలో ఎలా కూర్చుంటారు టీచర్?

రంగారావు : రామూ మీ నాన్నగారు వున్నారా?

రాము : ఉన్నారండి.

రంగారావు : పిలువు.

రాము : ఎండలు మండుతున్నాయి కదండి. ఎవరైనా వస్తే లేరని చెప్పమన్నారండి.

శ్యాము : తాతగారు నమస్కారం.

తాత : చల్లగా వుండు బాబూ.

శ్యాము : ఎండలు మండి పోతుంటే చల్లగా ఎలాగుంటాను?

ఐస్‌క్రీమ్ కొనివ్వండి చల్లగా వుంటాను.

**- మా.శ్రీ .రాజు, పాల్వంచ.**

కథ

# ఎవరి దారి వారిదే!

గన్నవరపు నరసింహ మూర్తి

సాయంకాలమైంది.
ఆఫీసులో పని ముగించుకుని బయటకు వచ్చాడు శ్రీహర్ష. అతని కోసం రోడ్డు మీద ఎదురు చూస్తూ కనిపించింది ప్రణవి.

“ఎంత సేపైంది వచ్చి?” అని ఆమెను అడిగాడు హర్ష.

“అరగంటైంది. ఎప్పుడూ నా కన్నా ముందు వచ్చేవాడివి. ఈరోజు నువ్వు బిజీనా”? అని అడిగింది.

“అదేం లేదు, ఫ్రెండ్స్ తో పోచికోలు కబుర్లు. అందుకే ఆలస్యం అయింది. పద కాఫీ తాగుదాము”అన్నాడు ఎదురుగుండా ఉన్న క్యాంటీన్ వైపు నడుస్తూ.

సాయంకాలం కాబట్టి క్యాంటీన్ ఖాళీగా ఉంది. అందరూ బైక్లు, కార్ల మీద ఇళ్ళకు వెళ్ళిపోతునారు. ఇద్దరూ ఓ మూల ఉన్న టేబుల్ దగ్గర కూర్చున్నారు. వెయిటర్ ఇద్దరికీ కాఫీలు తెచ్చాడు.

“ప్రణవి! నాన్నగారు పెళ్ళి చూపులనీ ఒకటే గొడవ చేస్తున్నారు. నువ్వు మన విషయం మీ నాన్నగారికి చెప్పావా?” అని అడిగాడు హర్ష కాఫీ తాగుతూ.

“లేదు హర్షా! నాన్నగారు ఆఫీసు నుంచి వచ్చేసరికి రోజు తొమ్మిది దాటుతోంది. సరైన సమయం కోసం చూస్తునాను. అది కుదిరితే వెంటనే చెప్పేస్తాను. డోంట్ వర్రీ” అంది ప్రణవి.

“నువ్వు ఇలాగే ఆలస్యం చేస్తూ ఉండు. ఏదో ఒక రోజు మీ నాన్న నిన్ను ఏ సాఫ్ట్వేర్ వాడికో ఇచ్చి పెళ్ళి చేసేస్తాడు. నేను అప్పుడు శాలువా కప్పి దేవదాసులా మారి పోతాను” అన్నాడు హర్ష నవ్వుతూ

“నువ్వేం భయపడకు. నేను ఒప్పుకుంటే కదా! చేసేది. నేను నిన్ను తప్పా ఇంకెవ్వర్నీ పెళ్ళి చేసుకోను. సరేనా” అంది కాఫీ కప్పు టేబుల్ మీద పడుతూ. అయినా మీ నాటి నీకెందుకంత భయం. ఇప్పటికి సంవత్సరమైంది. నాన్నతో చెబుతాను చెబుతాను అని వాయిదా వేస్తూ వస్తున్నావు, పిరికి వాళ్ళకు ప్రేమించే అధికారం ఉండదు. మన పెళ్ళి విషయం ఎంత త్వరగా చెబితే అంత మంచిది. ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. గుర్తు పెట్టుకో అన్నాడు హర్ష లేస్తూ.

“చెబుతాను హర్షా ఏదైనా సరైన సమయంలో చెప్పాలని కూడా పెద్దలే చెప్పారు. అతనికి చెప్పి మన పెళ్ళికి వొప్పించే బాధ్యత నాది. నువ్వు మీ నాన్న గారికి ముందు చెప్పు.నా విషయం నేను చూసుకుంటాను” అంది కోపంగా చూస్తూ..

ఆ తరువాత వాళ్ళిద్దరూ ఇంటికి వెళ్ళిపోయారు.ఆరోజు రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర తండ్రికి



ప్రణవితో తన పెళ్ళి గురించి చెప్పాలని నిర్ణయించుకుని శ్రీహర్ష ఆ విషయాన్ని ఇది వరకే తల్లి జానకికి చెప్పాడు. ఆమె కూడా ఈరోజు భోజనాలప్పుడు తండ్రికి చెబుతాననీ చెప్పింది.

తండ్రి శివరామ్ కోపిష్టివాడు. కొడుకుని చాలా స్ట్రిక్టుగా పెంచాడు. ఇంట్లో అతని మాటే వేదం. భార్య జానకికి కూడా అతనంటే భయం. ఏది చెప్పినా వినడు. అందుకే శ్రీహర్ష తండ్రికి తన పెళ్ళి గురించి చెప్పడానికి భయపడుతునాడు. పైగా వాళ్ళది సాంప్రదాయ కుటుంబం. కానీ ప్రణవి వాళ్ళది అతని కులం కాదు. ఈ విషయంలోనే శ్రీహర్ష భయపడుతునాడు. కులం విషయంలో శివరామ్ చాలా కఠినంగా వ్యవహరిస్తాడు. ఇంటర్కాస్ట్ మ్యారేజెస్ అతని కిష్టం ఉండదు. ప్రణవితో తన పెళ్ళికి ఏదైనా అడ్డు ఉందంటే అది కులం మాత్రమే. మిగతా విషయాలు అన్నీ ఒకే. ప్రణవి అందంగా ఉంటుంది. సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా చేస్తోంది.

రాత్రి ఎనిమిది గంటలకు తండ్రి భోజనానికి వచ్చాడు. ఎప్పుడూ తండ్రితో కలిసి భోజనం చెయ్యని శ్రీహర్ష ఆరోజు మాత్రం డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. కొడుకు తనతో బాటు భోజనానికి కూర్చోవడం శివరామ్కి ఆశ్చర్యం కలిగించింది.

“జానకి ఇద్దరికీ ప్లేట్లో వేడివేడి పరోటాలు, కప్పుల్లో వేడి బంగాళ దుంపల కూర తెచ్చి” పెట్టింది.

శివరామ్ ప్లేట్లోని పరోటాని తింటూ కొడుకుతో “హర్షా! నీకు రఘురామ్ తెలుసు కదా! ఇక్కడ మేం ఇద్దరం కలిసి పని చేసాము ఆయన ప్రతి ఆదివారం మనింటికి షటిల్ ఆడటానికి వచ్చేవాడు” అనీ

శ్రీహర్షి కొద్దిసేపు ఆలోచించి “ఆ గుర్తుంది రఘురామ్ అంకుల్ కదూ” అన్నాడు. అవును! అతనిప్పుడు హైదరాబాద్ నుండి ఇక్కడికి వచ్చేసాడు. ఎల్లుండి మనం వాళ్ళింటికి వెళుతునాము”అన్నాడు.

“ట్రాన్స్ ఫర్ అయిందా ఆయనకి” అన్నాడు హర్ష. “లేదు, రిటైరై పోయాడు. మొన్నే సీతమ్మధారలో ఇల్లు కొనుక్కున్నాడు. మనల్ని చూడటానికి రమ్మనమని పిలిచాడు” అని చెప్పాడు.

"మనం వెళ్ళడం దేనికీ! వాళ్ళనే మనింటికి రమ్మని పిలవలేకపోయారా?" అంది జానకి.
"రఘురామ్! స్మిత అనే ఒక కూతురు వుంది. ఆమె సాఫ్ట్ వేర్ కంపెనీ నడుపుతోందట. ఆ పిల్లని శ్రీహర్ష కివ్వాలనుకుంటున్నాడు రఘురామ్. అందుకే మనల్ని స్మితని చూడటానికి పిలిచాడు" అన్నాడు. శివరామ్.
ఆ మాటలకు శ్రీహర్ష ఆశ్చర్యపోతూ అమ్మ జానకి వైపు చూసాడు. ఆమె వెంటనే భర్త శివరామ్ వైపు తిరిగి "వాడు ఈ మధ్యనే ఉద్యోగంలో చేరాడు. ఇప్పుడు వాడి పెళ్ళికేం తొందర? కొద్దిరోజులు ఆగితే మంచిది" అంది.
"ఏ వయస్సులో ముచ్చట ఆ వయసులోనే తీరాలి. మనకి కావలసినప్పుడు అవకాశాలు రావు. అయినా వాడు నా స్నేహితుడు. అతన్ని కూతురు చాలా బుద్ధిమంతురాలట. ఈ ఇంటికి కోడలిగా వస్తే మంచిదని నా అభిప్రాయం. అయినా ఒకసారి పిల్లను చూస్తే ఏం పోతుంది?" అన్నాడు శివరామ్.
"పెళ్ళి చూపులకైతే నేను రాను" అన్నాడు శ్రీహర్ష,
"రావా! కారణం?"
"నేను ఒకమ్మాయికి మాటిచ్చాను" అన్నాడు హర్ష.
ఆ మాటకు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు శివరామ్
"ఓహో! అంటే పెళ్ళి విషయంలో నువ్వు ఓ నిర్ణయం తీసేసుకున్నావన్నమాట. నువ్వు చాలా పెద్దవాడిపై పోయావు" అన్నాడు కోపంగా,
"నాకిష్టమైన పిల్లని పెళ్ళి చేసుకుంటే తప్పా?".
"తప్పేంలేదు. ఇంతకీ ఆ పిల్ల ఎవరు? ఏం చేస్తుంటుంది" అన్నాడు అసహనంగా..
"ప్రణవి అని నా క్లాస్‌మేట్.. వాళ్ళ నాన్నగారు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా చేస్తుంటారు"అన్నాడు. హర్ష.
"ఆ పిల్ల వాళ్ళ నాన్నకి మీ పెళ్ళి గురించి చెప్పిందా?".
"లేదు. చెబుతానంది. అయినా వాళ్ళ నాన్న గారు ఒప్పుకుంటారు. ఆ అమ్మాయి ఒప్పిస్తుంది" అన్నాడు హర్ష"అంటే మీరిద్దరూ పెళ్ళి విషయంలో నిర్ణయం తీసేసుకున్నారన్నమాట. కానీ నేను రఘురామ్‌కి వాడి కూతురు స్మితని చూడ్డానికి వస్తానని మాటిచ్చాను. నాకీ విషయం ముందే చెబితే నేను అతనికి వస్తానని చెప్పకపోదును. జీవితంలో పెళ్ళి లాంటి ఎంతో ముఖ్యమైన విషయాన్ని పెద్ద వాళ్ళమైన మాకు చెప్పక్కర్లేదా? నీకు నువ్వే నిర్ణయాలు తీసుకుంటే ఎలా? అన్నాడు శివరామ్ కోపంగా
"అమ్మకి చెప్పాను. అమ్మ మీకు చెబుతానంది. అయినా ఏం పరవాలేదు. మీరు అంకుల్‌కి మాటిచ్చారు కాబట్టి నేను పెళ్ళి చూపుల కొస్తాను" అన్నాడు శ్రీహర్ష.
"ఎందుకూ రెండు పెళ్ళిళ్ళు చేసుకుందుకా?" కోపంగా అన్నాడు శివరామ్.
"అది కాదు నాన్నగారూ? నేను ఆ అమ్మాయితో వివరంగా మాట్లాడి ఆమెను ఒప్పిస్తాను. మీకేమి చెడ్డపేరు రాకుండా చూసే పూచీ నాది. మీరే విషయంలో వర్రీ కావద్దు" అన్నాడు శ్రీహర్ష.
"నువ్వు ఆ నిర్ణయాన్ని తీసుకున్న తరువాత చేసేదేముంది? అలాగే కానీ" అన్నాడు శివరా!! అసహనంగా "నాన్నగారూ! స్మితని చూసిన తరువాత మీరు ప్రణవిని కూడా ఒసారి చూడాలి. అలా మాటిస్తేనే నేను అంకుల్ ఇంటికి వస్తాను" అన్నాడు హర్ష.

...

రెండు రోజుల తరువాత ఆ రెండు కుటుంబాలూ ఒక హోటల్లో కలుసుకున్నాయి. రఘురాం తన కూతురు స్మితతో వచ్చాడు హోటల్‌కి.
శివరామ్ తన స్నేహితుడు రఘురాంను చూసి చాలా ఆనందించాడు.
"చాలా రోజులైందిరా నిన్ను చూసి, వీడు మా అబ్బాయి శ్రీహర్ష. టీసీయస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈమె నా భార్య జానకి" అనీ తన కుటుంబాన్ని పరిచయం చేసాడు శివరాం.
రఘురాం జానకికి నమస్కారం పెడుతూ "చాలా సంతోషం. ఈమె నా కూతురు స్మిత. సాఫ్ట్‌వేర్ కంపెనీ నడుపుతుంది" అంటూ కూతురిని వాళ్ళకి పరిచయం చేసాడు.
"హాయిగా హైదరాబాద్‌లో సెటిలవక ఇక్కడకు మళ్ళీ ఎందుకొచ్చావురా?" అని అడిగాడు శివరామ్.
"ఎంతైనా ఈ ఊళ్ళో పుట్టాను. నా కెందుకో విశాఖపట్నం అంటే చాలా ఇష్టం. అందుకే వచ్చేసాను. పైగా స్మితకి కూడా ఈ పట్నం బాగా నచ్చింది" అన్నాడు రఘురాం.
"అన్నయ్యగారూ! వదిన గార్ని తీసుకురావలసింది ?" అనీ రఘురాంని అడిగింది జానకి.
"ఆమె వాళ్ళమ్మకి బాగులేకపోతే పుట్టింటికి వెళ్ళిందమ్మా. రాగానే మీ ఇంటికి తీసుకువస్తాను. అది లేదు కాబట్టి ఈ హోటల్లో పెట్టాను. అది సరే, పిల్లలిద్దరూ బయటకు వెళ్ళి ఫ్రీగా మాట్లాడుకుంటే మంచిదనీ నా అభిప్రాయం. ఏరా నువ్వు ఏమంటావు" అన్నాడు శివరామ్‌తో రఘురాం.
"నాకేం అభ్యంతరం లేదు. పెళ్ళికి ముందు మనస్ఫూర్తిగా మాట్లాడుకొని ఒకరి అభిప్రాయాలు, ఆలోచనలు ఇంకొకరు పంచుకుంటే మంచిది అన్నీ బాగుంటేనే ముందుకు వెళదాము" అన్నాడు శివరాం.
ముందు శ్రీహర్ష మొహమాట పడ్డా ఆ తరువాత పెద్దవాళ్ళు పట్టుబట్టడంతో స్మితతో బయటకు వెళ్ళాడు. బయట దూరంగా పెద్ద లాన్ ఉంది. అక్కడ పెద్ద పెద్ద చెట్లు. కింద పచ్చటి పచ్చిక. చల్లటి గాలి వేస్తోంది. ఇద్దరూ ఒక చెట్టు కింది బెంచీ మీద కూర్చున్నారు.
"హాయ్! నా పేరు స్మిత" అంది స్మిత ముందుగా,
"హాయ్! ఐయామ్ శ్రీహర్ష" అన్నాడు హర్ష.
"మీరు ఇంజినీరింగ్ ఎక్కడ చేసారు? అనీ అడిగింది స్మిత.
"జెఎన్‌టియూలో మెకానికల్. ఆ తరువాత ఎంబిఎ ఆంధ్రా యూనివర్సిటీలో ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇది నా ప్రస్థానం" అన్నాడు నవ్వుతూ. "ఎందుకలా?" అంది స్మిత నవ్వుతూ;
"ఏముంది! మనకిష్టమైన చదువు చదివే అవకాశం ఏ తల్లి తండ్రులిస్తున్నారు చెప్పండి? డిమాండ్ ఏ చదువుకుంటే దాన్నే మనం చదవాలి. లేకపోతే మనం పనికిరాని వాళ్ళం అయిపోతాము. ఇంజినీరింగ్ తరువాత ఉద్యోగం రాకపోగానే మళ్ళీ ఎంబిఎ అంటూ రెండేళ్ళు వేస్ట్. ఆ తరువాత ఇప్పుడీ ఉద్యోగం. ఈ ఉద్యోగానికి నా చదువుకీ సంబంధం లేదు. రెండు కొత్త కోర్సులు నేర్చుకుంటే వచ్చింది ఇది. అయినా తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదీ ఉద్యోగం' అన్నాడు హర్ష.

**జీవితంలో పెళ్ళి లాంటి ఎంతో ముఖ్యమైన విషయాన్ని పెద్ద వాళ్ళమైన మాకు చెప్పక్కర్లేదా? నీకు నువ్వే నిర్ణయాలు తీసుకుంటే ఎలా?" అన్నాడు శివరామ్ కోపంగా "అమ్మకి చెప్పాను. అమ్మ మీకు చెబుతానంది. అయినా ఏం పరవాలేదు. మీరు అంకుల్‌కి మాటిచ్చారు కాబట్టి నేను పెళ్ళి చూపుల కొస్తాను"**

"మీరు చాలా బాగా చెప్పారు. జీవితాంతం మనల్ని తల్లితండ్రులు గైడ్ చెయ్యాలనుకుంటూనే ఉంటారు. మన తరం పిల్లలపై తల్లితండ్రులకు నమ్మకం ఉండటం లేదు. అందుకనీ మనం చెయ్యి వదలడానికి వాళ్ళు ఇష్టపడటం లేదు" అంది స్మిత.

అది సరె! మీరేంటి ఉద్యోగం చెయ్యకుండా స్వంతంగా కంపెనీ పెట్టారు? ఎలా ఉంది పరిస్థితి? అని అడిగాడు శ్రీహర్ష.

"నాకు మొదట్నుంచీ ఉద్యోగం అంటే ఇష్టం లేదు. అందుకే ఇంజనీరింగ్ పూర్తి అయిన తరువాత ఓ కంప్యూటర్ సెంటర్ ప్రారంభించాను. అది సాఫ్ట్ వేర్ కంపెనీ కాదు. నాన్నగారు ఏదో అలా అనేసేరు. ఇందులో ఇంజనీరింగ్ వాళ్ళకి పైథాన్, వోరాకిల్, సిప్లస్, జావా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లాంటి లాంగ్వేజెస్ నేర్పిస్తాము. నాకు ఆ లాంగ్వేజెస్ ఏవీ రావు. అందుకే కొందర్ని హైర్ చేసి నేర్పిస్తున్నాను. ప్రస్తుతానికి డల్‌గా ఉంది. ఓ ముప్పైమంది చేరారు. చూడాలి ఎలా ఉంటుందో?" విశాఖలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇప్పుడిప్పుడే వస్తునాయి కాబట్టి డిమాండ్ ఉండొచ్చు అంది స్మిత.

మంచి పని చేస్తునారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగాల్లో టెన్షన్స్ ఎక్కువ. మరి మీరేంటి అప్పుడే మేరేజ్ చేసుకోవాలనుకుంటున్నారు. "మేరేజ్ అయితే ఈ సెంటర్ని నడపటం కష్టం అవదా?" అని అడిగాడు శ్రీహర్ష.

"నాకైతే ఇప్పుడే పెళ్ళి ఇష్టం లేదు. కానీ నాన్నగారు బలవంతం పెడుతున్నారు. నా పెళ్లి చేసి తన బాధ్యత తీర్చుకోవాలనుకుంటునారు. మరి మీకు ఇష్టమేనా"?

"నాకిప్పట్నుంచీ పెళ్ళి ఇష్టం లేదండీ. కానీ మా నాన్న నా బుర్ర తినేస్తున్నాడు. తప్పక ఒప్పుకున్నాను. ఇక్కడికొచ్చి మీతో మాట్లాడి దీన్ని వాయిదా వేయించాలని వచ్చాను" అన్నాడు శ్రీహర్ష.

"ఒకే! ఆ విషయం మీ నాన్న గారితో చెప్పేయండి" అంది స్మిత.

"అది జరిగే పని కాదు కానీ మీరే ఏదో ఒకటి చెప్పి దీన్ని పోస్టుపోన్ అయేటట్లు చేసి నన్ను ఆదుకోండి.. ఇదేదో మీరు నచ్చక అంటున్నది కాదు. నాకు మీరు బాగా నచ్చారు. ఇంకా నేను సెటిల్ అవాలి. అందుకు. ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోవద్దు" అన్నాడు శ్రీహర్ష.

ఆ తరువాత ఇద్దరూ హోటల్‌కి వచ్చేసారు. అక్కడ వీళ్ళ కోసం వాళ్ళ ముగ్గురు ఎదురు చూస్తూ కనిపించారు. భోజనాల తరువాత రఘురాం"మేం వస్తామురా కొద్దిగా పనుంది. తరువాత అన్నీ తీరికగా మాట్లాడుదాము" అంటూ లేచాడు. స్మిత కూడా వాళ్ళకి వీడ్కోలు చెప్పి బయలుదేరింది.

ఆ తరువాత శివరామ్ హర్షతో "స్మితతో అన్నీ మాట్లాడేవా? రెండు రోజుల్లో ప్రణవి వాళ్ళ ఇంటికి కూడా వెళదాం. ఆ విషయం ఆ అమ్మాయికి చెప్పు" అన్నాడు.



"అలాగే నాన్నా! స్మితతో ఇప్పట్లో పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదనీ చెప్పాను. ఆ అమ్మాయి దానికి కన్విన్స్ అయింది. నేను ప్రణవితో మనం వాళ్ళింటికి వెళ్ళే విషయం తరువాత చెబుతాను. మీరిక్కడి ఉండండి. నేను కారు తీసుకొని వస్తాను "అంటూ కారు పార్కింగ్ వైపు వెళ్ళాడు.

లంచ్ టైమ్ కావడంతో పార్కింగ్ ప్రాంతం చాలా రద్దీగా ఉంది. అక్కడికి వెళ్ళడానికి అతనికి పావు గంటకి పైగా పట్టింది. ఒకదాని వెంట ఒకటి కార్లు వస్తుంటే అతను అక్కడ నిలబడి ప్రణవికి ఫోన్ చేసాడు. కానీ ఆమె ఫోన్ ఎత్తలేదు. మళ్ళీ ట్రై చేసాడు అయినా రెస్పాన్స్ లేదు. విసుగెత్తి కారు దగ్గరకు వెళ్ళబోతుంటే ఎదురుగా కనిపించిన దృశ్యం అతన్ని ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

అక్కడ ప్రణవి, ఇంకో అబ్బాయి చాలా దగ్గరగా ఒకరి భుజం మీద ఒకరు చేతులు వేసుకొని పార్కింగ్ దగ్గరికి వెళుతూ కనిపించారు. అతను వాళ్ళని తేరిపార చూసి ప్రణవా కాదా అన్న అనుమానాన్ని నివృత్తి చేసుకున్నాడు. ఆమె ప్రణవి, సందేహం లేదు! కానీ ప్రణవి అంత క్లోజ్‌గా ఇంకో అబ్బాయితో కనిపించడం అదే అతనికి అర్థం కావటం లేదు.

వెంటనే వాళ్ళ దగ్గరికి వెళుతూ "ప్రణవీ" అనీ పిలిచాడు శ్రీహర్ష. ఆమె వెంటనే వెనక్కి తిరిగింది. శ్రీహర్షని చూడగానే ఆమె దిగ్భ్రాంతికి గురై అలాగే నిలబడి పోయింది.

"ప్రణవీ! ఫోన్ చేస్తుంటే ఎత్తటం లేదేం?" అని దగ్గరికి వెళ్ళాడు.

అప్పుడు ఆమె పక్కనున్న యువకుడు ఆమెతో "ప్రణవీ! ఎవరీ అబ్బాయి?" అనీ శ్రీహర్షని చూస్తూ అడిగాడు.

"కాలేజీలో చదువుకున్నప్పుడు ఫ్రెండులే. అప్పుడప్పుడు ఫోన్లో విసిగిస్తుంటాడు" అని చెప్పింది అతనితో.

"ప్రణవీ! ఏం మాట్లాడుతున్నావ్? నేను నిన్ను విసిగిస్తున్నానా? ఇంతకి ఎవరీ అబ్బాయి?" అని అడిగాడు శ్రీహర్ష కోపంగా.

"నా పియాన్సీ. మళ్ళీ నెల మా ఇద్దరికీ పెళ్ళి. ఆ పనుల్లో బిజీగా తిరుగుతున్నాము. ప్లీజ్! నన్ను ఈ సమయంలో డిస్టర్బ్ చెయ్యకు" అంటూ కారెక్కి అతనితో వెళ్ళిపోయింది.

శ్రీహర్ష ఆ కారువైపు చాలాసేపు చూస్తూ అక్కడే నిలబడి పోయాడు. అతని మస్తిష్కం ఆలోచనలతో మొద్దుబారి పోయింది. పదినిమిషాల తరువాత కారు తీసి, అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళాడు.

ఇంటికెళ్ళిన తరువాత "ప్రణవికి చెప్పావా మనం వాళ్ళింటికి వస్తున్నామనీ" అనీ అడిగాడు శివరామ్.

"లేదు; అయినా ఆ అవసరం లేదు. నాకు స్మిత నచ్చింది. అంకులికి చెప్పి మిగతా విషయాలు మాట్లాడండి" అని చెప్పి వెళ్ళిపోయాడు శ్రీ హర్ష.

పెళ్ళి వంటి విషయాల్లో అలస్యం పనికిరాదు సమయంలో 'ఆ అమృతం విషం' అన్న సూక్తి అతనికి గుర్తు కొచ్చింది. కొడుకు మాటలకు శివరాం ఆలోచిస్తూ ఉండిపోయాడు

నెల రోజుల తరువాత శ్రీహర్ష, స్మితల పెళ్లి రంగరం వైభోగంగా జరిగింది. □

# క్లిక్.. క్లిక్.. క్లిక్

ఫొటోగ్రఫీ ప్రత్యేకమైంది. అందులోనూ మొక్కలు, లేలేత చిగుర్లు, పూల రేకులను కెమెరాల్లో బంధించడం.. మరింత ప్రత్యేకంగా నిలుపుతుంది. విభిన్న ఆకృతుల్లో ఉండే చెట్ల ఆకులు, వాటిపైనుంచి జాలువారే నీటి బిందువులను కలుపుకొంటూ.. ప్రకృతి సౌందర్యాన్ని 'క్లిక్' మనిపించడం.. అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. కేవలం మొబైల్ ఫోన్‌తో, ప్రకృతిలో కనిపించే అతిచిన్న వివరాలను ఫొటోలుగా మలిచే మొక్కల మాక్రో షాట్‌లను ఎలా తీయాలో తెలుసుకుందాం.

**క్లోజప్ ప్లాంట్ ఫొటోగ్రఫీ** మొక్కలు, వాటి ఆకులు, పూలపై ఉండే ఆకృతులు విభిన్నంగా ఉంటాయి. వివిధ రంగుల్లో కనువిందు చేస్తుంటాయి. వాటిని మాక్రో ఫొటోగ్రఫీతో మరింత హైలైట్ చేయొచ్చు. ప్రకృతి అందాలను మరింత ప్రత్యేకంగా క్యాప్చర్ చేయడానికి. ఖరీదైన కెమెరా గేర్ అవసరం లేకుండానే మీ ఫొటోగ్రఫీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు. కెమెరా సెట్టింగ్స్ ఆధునిక స్మార్ట్‌ఫోన్లు చాలావరకు శక్తిమంతమైన మాక్రో లెన్స్‌లతో వస్తున్నాయి. ఇవి మొక్కల్లోని అతిసూక్ష్మ వివరాలను కూడా గొప్పగా క్యాప్చర్ చేస్తాయి. అయితే, మీ ఫొటోలను మరింత మెరుగుపరచడానికి ఈ సెట్టింగ్స్ ఫాలో అయితే చాలు.
మాక్రో మోడ్ (అందుబాటులో ఉంటే) : క్లోజప్ షాట్స్ కోసం మీ స్మార్ట్‌ఫోన్ కెమెరాలో 'మాక్రో మోడ్'ను ఎనేబుల్ చేసుకోండి.

**ఫోకస్ :** మీరు హైలైట్ చేయాలనుకుంటున్న మొక్కలు, పువ్వుల డీటెయిల్స్‌పై ఫోకస్ చేయండి.

**హెచ్‌డీఆర్ మోడ్ :** షాడోస్– హైలైట్స్‌ను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా ఆరు బయట, వెలుతురు ఎక్కువగా ఉండే **వాతావరణంలో..** ఎక్స్‌పోజర్ : ఫొటోలు మరీ ప్రకాశవంతంగా ఉంటే.. మీరు కోరుకున్న డీటెయిల్స్ సరిగ్గా కనిపించవు. కాబట్టి, ఎక్స్‌పోజర్ లెవెల్స్‌ను కొద్దిగా తగ్గించండి.ప్రో/ మాన్యువల్ మోడ్ : ఫొటోగ్రఫీపై పూర్తి నియంత్రణ కోసం.. షట్టర్ స్పీడ్‌ను సర్దుబాటు చేయడానికి ఈ మోడ్ చాలా ఉపయోగపడుతుంది.

ISO : తక్కువ ISO (100200)తో ఫొటోలు తీయండి. దీంతో డిజిటల్ నాయిస్ తగ్గుతుంది. ఫొటోలు మరింత షార్ప్‌గా వస్తాయి.

**ప్రో టిప్ :** మీ ఫోన్లో మాక్రో మోడ్ లేకపోతే.. డీటెయిల్స్ షార్ప్ అయ్యేదాకా కెమెరాను మీ సబ్జెక్ట్ దగ్గరి దాకా తీసుకెళ్లండి. దూరంగా ఉండి 'డిజిటల్ జూమ్' చేయకండి. ఇది.. మీ ఫొటోల నాణ్యతను తగ్గిస్తుంది.
లైటింగ్‌మొక్కల క్లోజప్ ఫొటోలు మరింత షార్ప్‌గా రావాలంటే.. లైటింగ్ చాలా అవసరం. కాబట్టి, కింది సూచనలు పాటిస్తే సరి.



**నేచురల్ లైట్ :** ఆరు బయట ఫొటోలు తీయాలనుకుంటే.. గోల్డెన్ అవర్ (ఉదయం 7గం. 9గం. వరకు, సాయంత్రం 4గం.–6 గం. వరకు) మంచి సమయం. ఈ సమయంలో వచ్చే మృదువైన, బంగారు వర్ణపు కాంతి.. మొక్కల టెక్చర్‌ను మరింత పెంచుతుంది.

**క్లౌడీ డేస్ :** మబ్బులు పట్టిన ఆకాశం.. మధ్యాహ్నపు వేళ ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇలాంటి సమయంలో మొక్కల ఫొటోలు మరింత అందంగా వస్తాయి.
**బ్యాక్‌లైటింగ్ :** మొక్కల వెనుక నుంచి వచ్చే సూర్యరశ్మి.. ఆయా మొక్కలను అద్భుతంగా చూపిస్తుంది.
**కృత్రిమ కాంతి :** ఇండోర్ షాట్ల కోసం ఎల్ఈడీ రింగ్ లైట్, సాఫ్ట్‌బాక్స్ లేదా డెస్క్‌ల్యాంప్, తెల్లటి రిఫ్లెక్టర్లు వాడండి. ఇవి మొక్కలు, పువ్వుల్లోని డీటెయిల్స్‌ను మరింత హైలైట్ చేయడానికి ఉపయోగపడతాయి.
**ప్రో టిప్ :** మొబైల్ కెమెరా ఫ్లాష్‌ను ఉపయోగించకండి. ఎందుకంటే.. ఫ్లాష్‌లైట్ నుంచి వచ్చే కాంతి హార్ద్‌గా ఉంటుంది. ఆకులు, పువ్వుల్లోని డీటెయిల్స్‌ను దెబ్బతీస్తుంది. కంపోజిషన్ టిప్స్ మంచి కంపోజిషన్‌లో తీసే ఫొటోలు కళాత్మకంగా వస్తాయి. దృశ్యపరంగా ఆకర్షణీయంగానూ కనిపిస్తాయి.

**రూల్ ఆఫ్ థర్డ్స్ :** మీ సబ్జెక్ట్‌ను ఫ్రేమ్ మధ్యలో ఉంచడం మంచిది. ఈ బ్యాలెన్స్‌డ్ కంపోజిషన్.. మీ ఫొటోను మరింత సహజంగా చూపిస్తుంది.
**యాంగిల్స్‌తో ప్రయోగం :** లో యాంగిల్ షాట్‌లు : మొక్కను లోయాంగిల్ (కింది నుంచి) చూడటం వల్ల.. అంతెత్తున, అద్భుతంగా కనిపిస్తుంది. టాప్ యాంగిల్

**షాట్‌లు :** మొక్కలను పైనుంచి చూస్తే విభిన్నంగా కనిపిస్తాయి. వాటి లేలేత చిగుర్లను ఫొటోలు తీయడానికి టాప్ యాంగిల్‌లో ఫొటోలు తీయండి.
**టాప్ డౌన్ షాట్‌లు :** ఆకు నమూనాలు, పువ్వులను ఫొటోలు తీయడానికి పనిచేస్తుంది.

**ఆబ్జెక్ట్స్‌ను చేర్చండి :** మీ సబ్జెక్ట్ (ఆకులు/ పువ్వులు) మరింత ప్రత్యేకంగా కనిపించాలంటే.. వాటిపై నీటి బిందువులు/ కీటకాలను చేర్చండి. ఆకుల నుంచి జాలువారే వర్షపు చినుకులు.. పువ్వులపై వాలే తేనెటీగలు, సీతాకోక చిలుకలు, చీమలు.. మీ ఫొటోకు ప్రాణం పోస్తాయి.

**ప్రో టిప్ :** ఫొటోల్లో డీటెయిల్ ప్రత్యేకంగా కనిపించేందుకు షార్ప్‌నెస్, కాంట్రాస్ట్‌ను కొద్దిగా పెంచండి. అతిగా సవరిస్తే ఫొటోలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో మాక్రో లెన్స్ లేకపోతే.. క్లోజప్ షాట్స్ కోసం క్లిప్‌ఆన్ మాక్రో లెన్స్‌ని ఉపయోగించండి. ఫోకస్, లైటింగ్‌తోపాటు కంపోజిషన్‌పై పట్టు సాధించడం ద్వారా.. నిత్యం చూసే మొక్కలనే అద్భుతమైన కళాఖండాలుగా మార్చవచ్చు. ■

# యద్భావం తద్భవతి !

**యామిజాల జగదీశ్**

**భారతదేశంలో** యువత డిప్రెషన్‌కు గురవుతున్నారు. ఇవి పురాణకాలం నుంచి ఉన్నా అప్పుడు వాటిని తమ మానసిక శక్తితో జయించేవారు. నేడు పరిస్థితులు మారాయి. ఒకప్పుడు అర్జునుడు కురుక్షేత్ర యుద్ధం ప్రారంభించే ముందు తీవ్రనిరాశకు గురయ్యాడు. కౌరవ సైన్యాన్ని చూసి చెమటలు పట్టాయి. గుండెల్లో దడ ప్రారంభమయింది. శరీరం నిస్సత్తువుగా అర్థంలేని ఉద్వేగం భయాందోళనలు కలిగాయి. ఏది మంచో ఏది చెడో తేల్చుకోలేని స్థితి. అలాంటి స్థితిలో కృష్ణుడు ఒక కౌన్సిలర్‌లా వ్యవహరించి గీతాబోధన చేసి అర్జునుడిలో ధైర్యాన్ని నింపి యుద్ధోన్ముఖుడిని చేశాడు. భగవద్గీత మంచి ప్రేరణ కలిగించేదిగా నిలిచిపోయింది.

మనం ఒకలా జీవించాలనుకుని మరోలా బతుకుతాం. ఊహలకు వాస్తవాలకు మధ్య పొంతన లేకుండా పోయేకొద్దీ జీవితం పట్ల మమకారం తగ్గుతుంది. నిరాశ ఎక్కువవుతుంది. నిస్పృహ ఆవహిస్తుంది. ఈ పరిణామాలు దేనికైనా దారితీయవచ్చు. మనో వైకల్యం ఆత్మహత్యలకు దారితీయవచ్చు హత్యలకు ఉసిగొల్పవచ్చు. విడాకులు తీసుకోవచ్చు. ఉద్యోగాన్ని కోల్పోయి వ్యాపారంలో దివాలా తీయవచ్చు.వృత్తి జీవితంలో తీవ్రంగా అపజయం కలగవచ్చు. ఇవన్నీ డిప్రెషన్ వల్లే జరుగుతాయి. డిప్రెషన్ లక్షణాలను ఇతరుల్లో గమనించవచ్చు.

అకారణమైన దిగులు, అర్థం లేని ఆత్మన్యూనత, ఒంట్లోని శక్తిని పిండే స్తున్న నిస్సత్తువ, ఎడతెరిపి లేకుండా ప్రతికూల ఆలోచనలు, ఏ విషయం మీద మనసు కేంద్రీకరించలేని చపల త్వం, దేని మీద ఆసక్తి లేకపోవడం, మరణభయం, ఆత్మహత్య ప్రస్తావనలు, కుటుంబ జీవితం అంటే నిరాసక్తత, ఇతరులతో కలవకుండా ఒంటరిగా ఉండడానికి అలవాటుపడడం ఈ లక్షణాల్లో కనీసం నాలుగైనా ఎక్కువ కాలం ఉంటే వాళ్ల డిప్రెషన్ (కుంగు బాటు) ఊబిలో చిక్కుకున్నట్లే. ఈ డిప్రెషన్ మనిషి ఆలోచనపై, ప్రవర్తన మీద, శారీరక ఆరోగ్యంపై, కోపం చిరాకు వంటి ఉద్వేగాలపై ప్రభావం చూపిస్తాయి. దీంతో కొన్ని రసాయనాల ఉత్పత్తి వేగవంతం అవుతుంది. దీనివల్ల అనేక దుష్పరిణామాలు కలుగుతాయి.

డిప్రెషన్ అంతర్జాతీయ సమస్య అయినా భారత్‌లో ఇది ఎక్కువగా ఉంది. అమెరికా వంటి దేశాల్లో ప్రజలు నెలకోసారి తప్పనిసరిగా మానసిక శాస్త్రవేత్తలను కౌన్సిలర్లను కలుస్తుం టారు. మనదేశంలో సామాన్యులకేగాక సాధారణ వైద్యులకు మానసిక రుగ్మతల



గురించి అవగాహన లేదు. ఇక్కడ సామాజిక పరిస్థితులు ఆశాజనకంగా ఉండవు. నిరుద్యోగం పేదరికం స్వార్థరాజకీయాలు హింసాత్మక సంఘటనలు ఇలా ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుంది. నిరక్షరాస్యులు ఎక్కువగా డిప్రెషన్‌కు గురవుతుంటారు. కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఆత్మహత్యల్లో 32 శాతం మనదేశంలో జరుగుతున్నాయి. దీనికి 90 శాతం డిప్రెషన్ ప్రధానకారణం.

దాదాపు 36శాతం భారతీయులు ఏదో ఒక సందర్భంలో డిప్రెషన్‌లో కూరుకుపోతున్నారని 2020 నాటికి ప్రాణాలను హరించడంలో క్యాన్సర్ తర్వాత డిప్రెషన్ ఆక్రమిస్తుందని ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకిలాజికల్ మెడిసిన్ ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తరచు బడికి దుమ్మా కొట్టేవారిలో డిప్రెషన్‌ను గుర్తించారు. కన్నవారి విషయంలో అంచనాలు పెరిగిపోతున్నాయి. తమ బిడ్డలు మొదటి స్థానంలో ఉండాలని వారిని శాసిస్తున్నారు. పిల్లల పరిమితు లను పరిజ్ఞానాన్ని ఇష్టాలను అసలు లెక్కలోకి తీసుకోవడంలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర వత్తిడికిలోనై

డిప్రెషన్‌గా మారుతుంది. మొండి తనం, మంకుపట్టు, సెల్‌ఫోన్లు సోషల్ నెట్‌వర్కింగ్ వ్యసనాలు, అతి తిండి, అతినిద్ర, ఇతరులతో తగాదాలకు దిగడం, ఇవన్నీ ప్రాథమిక లక్షణాలంటు న్నారు ప్రముఖులు. ఇప్పుడు విజయానికి జీతంగాని, ఒక వ్యక్తి సంపాదించే డబ్బుగాని కొలమానం అవుతున్నది. దాంతో ఉద్యోగి ఆరోగ్యాన్ని వ్యక్తిగత జీవితాన్ని తన ఉద్యోగానికి పణంగా పెడుతు న్నాడు. అత్యాశ తపనలతో ఆధునిక జీవి నేలవిడిచి సాము చేస్తున్నాడు. దీంతో అధిక రక్త పోటు షుగరు ఊబకాయం మనిషిని పీడిస్తున్నాయి. జీవిత భాగస్వామి పిల్లలు బంధువులతో సంబంధాలు సరిగ్గా ఉండడంలేదు. అతి తక్కువగా ఉంటున్నాయి. దాంతో అనేక మానసిక సమస్యలు చుట్టుముడుతున్నాయి. ప్రేమ రాహిత్యం భవిష్యత్తు పట్ల అనిశ్చితి గృహహింస చిట్‌ఫండ్ కంపెనీల వంటి మోసాలు డిప్రెషన్ కలిగిన యద్భావం తద్భవతి అని మన దేశం సంప్రదాయం చెబుతోంది. మనసు దుర్బలంగా ఉన్నపుడు అనేక ఆలోచనలు, అర్థంలేని భయాలు, తలాతోక లేని ఊహలు చుట్టుముడ తాయి. అయితే ఈ పరిస్థితులు ఉన్నప్పుడు ఎవరితోనైనా బాధలు పంచుకుంటే భారం తీరుతుంది. తన వైఫల్యాలను పంచుకోవడానికి మంచి స్నేహితులు దొరకాలి. అప్పుడు చెత్తంతా వదిలిపోయి మనసు తేలికపడుతుంది. కానీ ఈ రోజుల్లో ఎవరి బతుకు వారిదే ఇంకొకరి కష్టాలు వినే ఓపికలేదు. ఎవరికైనా దీర్ఘకాలికంగా ఉన్న డిప్రెషన్‌ను గుర్తించడం కష్టం. కొందరిలో చాలా ప్రతిభ సామర్థ్యం దాగి ఉంటుంది. అది వారు గుర్తించరు.

వారి చుట్టూ ఉన్నవారు గుర్తించరు. ఈ శక్తులను ప్రతికూల ఆలోచనలు అణచివేస్తాయి. అలాంటి వారికి వారిలోని సహజశక్తియుక్తులను గుర్తుచేసి ప్రతికూల అంశాలను తొలగించుకోమని చెప్పగలగాలి. అదే కౌన్సిలింగ్. ◆

**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్స్: 9885446501/9885449458




# పీడిత ద్వార దోషం

**పీడితమ్ పీడాకరం స్వాత్:**

గృహ ద్వారము యొక్క 'గడప' గృహ ద్వార బంధానికి తగినట్లుగా వుంటే సర్వ సంపదలు తోడై వుంటాయి. 'గడప' ద్వార బంధానికి తగినట్లుగా గాక హెచ్చు తగ్గులుగా వుంటే 'పీడిత ద్వార దోషము' గలిగి దుష్ఫలితాలు అనుభవించవలసి వస్తుంది. ఇటువంటి దోషము గలిగిన గృహ యజమాని, లేదా అందులో అద్దెకు నివసించు వారు కూడా సదా పీడనను (టెన్షన్లు) అనుభవించవలసి వస్తూ వుండే అవకాశాలు ఎక్కువ. అందుకని ద్వార బంధాలు తయారు చేయునపుడే 'గడప' గురించి జాగ్రత్త పడాలి. ద్వారబంధపు చెక్క మందము కంటే 'గడప' మందము హెచ్చు తగ్గులు ఉండకూడదు. చెక్క మందము ప్రధాన ద్వారానికి ఎక్కువగాను, మిగతా ద్వార బంధాలకు తక్కువగానూ వుండటం సర్వసాధారణం. గృహానికి సరిపడు విధంగా ద్వార బంధం వుండాలి.

ద్వారబంధపు చెక్క మందము గడపకు కూడా వుండలి. 'గడప' నేల యొక్క పై భాగానే ప్రతిష్టింపబడాలి. బండలు, టైల్స్ వేయునపుడు 'గడప' కొంత భాగం కూడా కప్పబడి లోనికి పోకూడదు. గడప విషయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే అనేక విధాల కష్టనష్టాల బారినపడకుండా భద్రతను పొందవచ్చును.

**సంగం చిత్తారయ్యా**

**ప్రశ్న:** ఈ మధ్యనే, మా యింటి వెనుకనున్న ఖాళీ స్థలములో,పడమ ప్రహారీ గోడ అవతల ఒక ముండ్ల చెట్టు మొలిచి బలంగా పెరిగిపోతున్నది.మాకు ఉన్నంతలో బాగానే వున్నాము గానీ, ఈ మధ్యనే అనుకోని విధంగా సమస్యలు, అందరికీ అనారోగ్య సమస్యలు రావటం విచిత్రంగా అనిపిస్తున్నది. ఈ ముండ్ల చెట్టు అసంఖ్యాకమైన ముండ్లతో ఆరు అడుగుల ఎత్తుకు బలంగా మొలచి పెరిగింది. కొన్ని రకాల చెట్లు వుంటే మంచిదంటారు. ఇలాంటి ముండ్ల చెట్టు వుండవచ్చునా? అనుకోని సమస్యలకు ఇటువంటి చెట్లు కారణమనుకోవచ్చునా? తీసేయాలా?

**జవాబు :** గృహావరణలో ముండ్ల చెట్లు వుండగూడదన్న వాస్తు నియమున్నదన్న మాట వాస్తవమే! మీ ఇంటికి పడమర వైపు మొలచిన చెట్టు ఎన్నో శాఖలతో ఎన్నో ముండ్లతో కూడి వంటే అది గృహావరణలో పరిసరాలలో వుండగూడని చెట్టుగా పరిగణలోకి తీసుకొనవచ్చును. గృహావరణలో తాడిచెట్లు, మర్రిచెట్లు, ఈత చెట్లు, తుమ్మ చెట్లు వుండకూడదు. మీరు పేర్కొన్న చెట్టు 'తుమ్మచెట్టు' అయివుంటుంది. నిస్సందేహంగా మీరు ఆ చెట్టును తీసేయవచ్చును. ముండ్ల చెట్లయినప్పటికీ నిమ్మ, గులాబి॥ మొక్కలు గృహావరణలో పెంచవచ్చును. మీ పరిశీలన అభినందించాల్సిందే. చెట్టును నిర్మూలించిన (15రోజుల) తర్వాత మీ పరిస్థితుల మార్పులను తెలియ జేయండి.

**ముక్కుటేశ్వర రావు, బాపట్ల**

**ప్రశ్న:** మేము గృహ నిర్మాణం కోసం ఒక స్థలం కొన్నాము. తూర్పున వీధి వుంది. ఆ స్థలము యొక్క తూర్పు దిక్కున (దిక్సూచీ ప్రకారం) 10డిగ్రీలు ఉత్తరానికి తిరిగి వున్నది. మా సందేహమేమిటంటే మేము కట్టబోయే గృహాన్ని కూడా అలాగే 10 డిగ్రీల ఉత్తరానికి తిప్పి కట్టాలా? లేక 'పర్‌ఫెక్ట్‌గా' తూర్పుకు తిప్పి కట్టాలా?




**జవాబు:** అలా కట్టగూడదు. స్థలాన్ని బట్టే గృహ నిర్మాణం వుండాలి. ఆలయ నిర్మాణాలకు, ప్రార్థనా మందిరాలకు 0 డిగ్రీలు వుండాలి.

అంటే తూర్పుకు సరాసరి వుండాలి. నివాస గృహాలకు ఈ నియమం వర్తించదు. దాదాపు 15 డిగ్రీలు తిరిగి వున్నా కట్టుకోవచ్చును. అయితే ముఖ్య విషయం. ఏమిటంటే..'ఎటు వీధి వున్న స్థలమైతే ఈ 15 డిగ్రీలు ఎటు తిరిగి వున్నా మంచి ఫలితాలొస్తాయనేది ! మీ విషయంలో ఇలా 10 డిగ్రీల ఉత్తరానికి తిరిగి వున్నా సరే మీరు ఆ స్థలంలో వాస్తు ప్రకారం గృహ నిర్మాణం గావించుకోవచ్చును.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ......................................

పుట్టిన తేది : ......................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:..........................................

# శ్రీగిరి వాసం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

**అమరావతి పాలకుడైన శ్రీ వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడికి స్వప్న దర్శనం ఇచ్చి తాను శ్రీగిరి పైన కొండ గుహలో ఉన్నానని, వచ్చి దర్శించుకొని ఆలయం నిర్మించమని తెలిపారట. ఆయన అలానే చేశారని ప్రతీతి.**

మరుసటి రోజున రాజు సమస్త పరివారంతో వచ్చి కొండ అంతటా గాలించినా స్వామివారి రూపం కనపడలేదట. ఏమీ పాలుపోని రాజు అక్కడే శ్రీనివాసునికి పూజలు చేసి ఆయన దర్శనం ప్రసాదించమని ప్రార్థించారట. అప్పుడు ఆ బాలుడు రాజు ముందు ప్రత్యక్షమై తనతో రమ్మన్నారట. వెనుక వెళ్లగా చిన్న గుహలోకి వెళ్లి అదృశ్యమైనాడట. గుహలో చూడగా రాతి మీద తిరునామం, శంఖు చక్రాల రూపంలో దేదీప్యమానంగా వెలుగుతూ స్వామివారు దర్శన మిచ్చారట. వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు తన అదృష్టానికి పొంగిపోయి ఆలయాన్ని నిర్మించి, నిర్వహణ నిమిత్తం కొంత భూమిని కూడా ఇచ్చారట.

**శ్రీ రాజా వాసిరెడ్డి వెంకట్రాది నాయుడు :**
వీరు 1783-1816 వ సంవత్సరం వరకు పంచారామ క్షేత్రమైన అమరావతిని రాజధానిగా చేసుకొని నైజం నవాబులు, ఆంగ్లేయులకు సామంతునిగా పాలించారు. కవిపండిత పక్షపాతి. ప్రజలను చక్కగా పాలించిన పాలకుడు. తన యేలుబడిలో



ఉన్న నాలుగు వందల పైచిలుకు గ్రామాలలోనే కాకుండా అనేక క్షేత్రాలలో యాత్రీకుల సౌకర్యార్థం ధర్మ సత్రాలను నిర్మించారు. ఈయన తన రాజ్యంలో సుమారు వందకు పైగా నూతన ఆలయాల నిర్మాణం లేదా పునః నిర్మాణం చేసారని, నిర్వహణకు ధన భూ వసతులను సమర్పించుకొన్నారని తెలుస్తోంది.

**ఆలయ విశేషాలు** కృష్ణానది ఉత్తర తీరంలో శ్రీగిరిగా పిలిచే చిన్న పర్వతం మీద ఈ ఆలయం నిర్మించబడినది. పర్వతం పైకి వెళ్ళడానికి సోపానమార్గం ఉన్నది. పైకి దూరానికి ఆలయ విమాన గోపురం ధ్వజస్థంభం కనిపిస్తాయి. ఇక్కడ కూడా శ్రీవారు కొలువు తీరిన గుహ పైన విమానగోపురం నిర్మించబడినది. ధ్వజస్థంభం వద్ద శ్రీ ఆంజనేయస్వామి వినమ్రంగా నమస్కారభంగిమలో దర్శనమిస్తారు. ధ్వజస్థంభం వెనుక స్వామివారి రూపానికి నిదర్శనంగా తిరునామం, శంఖుచక్రాలను పెద్ద బోర్డు రూపంలో ఉంచారు. ఆలయానికి ఉన్న ప్రధాన ద్వారం పడమర ముఖంగా ఉంటుంది. లోనికి వెళితే ముఖమండపం లాంటి గదిలో స్వామివారు దివ్య రూపం, ఆళ్వారులు, ద్వారపాలకులు కనిపిస్తారు. చిత్రమైన విషయం ఏమిటంటే ద్వారపాలకులు వెలుపల కాకుండా లోపల అదీ గర్భగుహ వైపుకు తిరిగి ఉండటం. ఇక్కడ పైకి వెళ్ళడానికి మెట్లు ఉంటాయి. సన్నటి గుహ. ఒక మనిషి మాత్రమే నిలబడటానికి అవకాశం ఉన్నది. అర్చకస్వామి కూడా నిలబడే పూజాదులు నిర్వహించాలి. ఈ గుహలో దక్షిణాముఖంగా రాతి మీద శంఖుచక్రాలు మధ్యలో తిరునామం, క్రింద శరీరభాగాన్ని పోలిన ఉబ్బెత్తుగా ఉన్న భాగం మాత్రమే కనిపిస్తాయి. శ్రీవారి రూపం అపరిమితమైన ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదిస్తుంది. నిత్య పూజలతో పాటు పర్వదినాలలో, ఆలయ ఉత్సవాలలో, ధనుర్మాస పూజలలో, వైకుంఠ ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అర్చకస్వామివారి కుటుంబం గత నాలుగు తరాలుగా స్వామివారి సేవలో తరిస్తోంది అంటే ఆలయం విశేషం ఇంతకన్నా మనకి ఏమి కావాలి!

**శ్రీ గంగా భవానీ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం**

శ్రీగిరి వెనుక ఉన్న మరో చిన్న పర్వతం మీద శ్రీ గంగాభవానీ సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయం నిర్మించబడినది. రాజా వారు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తున్న సమయంలో గ్రామస్థులు తమకొక ఈశ్వరాలయం కూడా కావాలి అని కోరారట. వారి అభీష్టాన్ని మన్నించి ఈ ఆలయం నిర్మించడం జరిగింది. కొండ పైకి వెళ్ళడానికి మెట్లమార్గం ఉన్నది. పైన ఎలాంటి విశేష నిర్మాణాలు లేని సాదాసీదా ఆలయం. తూర్పు ముఖంగా ఉంటుంది. ఎత్తైన ధ్వజస్థంభం దూరానికి ఆలయ ఉనికిని తెలియచేస్తుంది. ద్వారానికి ఇరుపక్కలా శ్రీ గణపతి, సర్ప రూపంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ద్వారపాలకుల మాదిరి ఉపస్థితులై దర్శనమిస్తారు.

గర్భాలయంలో లింగ రూపంలో శ్రీ భీమేశ్వరస్వామి వారు చక్కని దర్శనాన్ని అనుగ్రహిస్తారు. ఈ ఆలయంలో కూడా నిత్యపూజలు, కార్తీకమాస పూజలు, మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. చుట్టూ పచ్చని పొలాలు, స్వచ్ఛమైన వాతావరణంలో ఉన్న ఈ ఆలయాల సందర్శన భక్తులకు ఒక మధురమైన జ్ఞాపకంగా మిగిలి పోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాకపోతే ఆలయం సందర్శించాలి అంటే ఉదయం తొమ్మిది లోపల వెళ్లడం ఉత్తమం. కలియుగ వరదుడు స్వయంవ్యక్తగా కొలువు తీరిన జూపూడి గ్రామం విజయవాడ నుండి ఇరవై కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్ మార్గంలో ఇబ్రహింపట్నం దాటిన తరువాత ప్రధాన రహదారి నుండి కొద్దిగా లోపలికి ఉంటుంది. బస్సు సౌకర్యం దరిదాపుగా లేనందువలన స్వంత వాహనంలో వెళ్లడం ఉత్తమం. ◆



పర్యాటకం

**తెలుగు రాష్ట్రాల్లో హస్తకళలకు నిలయాలుగా భాసిల్లిన గ్రామాలు మూడింటి ప్రాశస్త్యం ప్రాచీనకాలం నాటిది. (ఏటికొప్పాక, కొండపల్లి, నిర్మల్) వాటిలో ఆంధ్రప్రదేశ్లోని అనకాపల్లి జిల్లాలోని వరాహ నది ఒడ్డున ఎలమంచిలి మండలంలో ఉన్న ఒక చిన్న గ్రామం ఏటికొప్పాక. ఈ గ్రామస్తులు వందల ఏళ్లుగా బొమ్మలను తయారు చేస్తున్నారు.**

# మొఖాసాల కళ ఏటికొప్పాకతో ఫిదా!

షేక్ అబ్దుల్ హకీం జాని

అంకుడుకర్రతో ఈ బొమ్మలను తయారు చేసి లక్కను అద్దుతారు. అందువల్ల ఏటికొప్పాక లక్క బొమ్మలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి చెందినవి. ఈ చేతివృత్తి కళాకారుల నైపుణ్యం ఎంత గొప్పదంటే ఏటికొప్పాక లక్క బొమ్మలను ఎక్కడ తాకినా సరే నునుపుగా ఉండి అన్ని వైపులా గుండ్రంగా ఉంటాయి. ఎక్కడా కూడా పదునైన అంచులు వంటివి ఉండవు. చేతితో కదిలించే మిషన్ ఆధారంగా సన్నని, సున్నితమైన భాగాలను తయారు చేస్తారు. లేత్ మిషన్ మీద ఆ రూపాన్ని దిద్దుతారు. అంతటి అద్భుత ప్రతిభ వీరి సొంతం. పౌరాణిక పాత్రలు, సంగీత వాయిద్యాలు, గృహాల అలంకరణల బొమ్మలు, జంతువుల బొమ్మలు వీరి చేతుల మీదుగా ప్రాణం పోసుకుంటున్నాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఏటికొప్పాం కళాకారుల ప్రతిభ అద్దం పడుతోంది. అందుకే ఆ బొమ్మలు దేశ విదేశాల్లో సైతం ప్రాచుర్యం పొందాయి. వాటిని చూసిన ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అందుకే ఏటికొప్పాక పేరు చెప్పగానే ముచ్చట కొలిపే లక్క బొమ్మలు టక్కున గుర్తుకు వస్తుంటాయి. వంట చెరకుగా కూడా పనికిరాని అంకుడు కర్రతో అద్భుతమైన కళాఖండాలు తయారు చేయడం ఇక్కడ కళాకారుల ప్రతిభకు అద్దం పడుతుంది. అంకుడు కర్రతో చేసిన అద్భుత కళాఖండాలకు లక్కతో ఫినిషింగ్ చేసి మెరిసేలా చేయడం ఇక్కడి బొమ్మల ప్రత్యేకత. ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమకు ఘనమైన గత చరిత్ర ఉంది. ఆది నుండి ఏటికొప్పాక బొమ్మలే కాక కొయ్యను తరిణ పట్టి చేసే పలు వస్తువుల తయారీకి పేరొందింది.

నేటికీ ఇక్కడి కళాకారులు కలపతో తయారుచేసే పలు అందమైన బొమ్మలే కాక లక్క పిడతలు, పిల్లలు ఆడుకునే వంట చట్లు, వివాహిత స్త్రీలకు పెళ్లి కానుకగా ఇచ్చే పసుపు, కుంకుమ, సాంబ్రాణి, వక్కలు ఇత్యాదివి వేసుకునే ఆరు లక్క భరిణెల సారె, స్టూల్ కోళ్ళు వంటివన్నీ కలపను తరిణ పట్టి తయారు చేసేవారు. స్థానికుల కథనం ప్రకారం ఇక్కడ అనాదిగా నేరేడు, పనస కలపలతో చేసే



కుంచాలు, అంకుడు కలపతో చేసే తవ్వలనే ఒకప్పుడు తెలుగునాట ధాన్యం కొలిచేందుకు వాడేవారట. నాలుగు గిద్దలు ఒక సోల. రెండు సోలలు ఒక తవ్వ రెండు తవ్వలు ఒక మానిక, కొన్ని ప్రాంతాలలో మానికనే ముంత అని కూడా వ్యవహరిస్తారు. నాలుగు మానికలు లేదా నాలుగు ముంతలు ఒక కుంచము. ఇవి ప్రాచీనకాలంలో ధాన్యం కొలిచేందుకు వాడే కొలమానాల వివరాలు. తూర్పు చాళుక్యుల పాలనాకాలం నుంచే ఏటికొప్పాక కుంచాలు, తవ్వల తయారీకి ప్రతీతి.

**ప్రాచీన చరిత్ర** ఏది ఏమైనా ఈ ప్రాంతపు ప్రాచీన చరిత్రను లోతుగా అధ్యయనం చేస్తేనేగానీ ఇక్కడి హస్తకళాకారుల కొయ్య ఉత్పాదనల ప్రాశస్త్యాన్ని గురించి, వాటి ఎగుమతుల సంబంధించిన మరిన్ని విశేషాలు వెలుగులోకి రావు, నేటి ఏటికొప్పాక బొమ్మలలో ఎక్కువగా కనిపించే గుంబజ్లోను బట్టి ఈ బొమ్మల పరిశ్రమ మీద బహమనీ సంస్కృతి ప్రభావం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు ఈ ప్రాంతమంతా బహమనీ సుల్తానుల పాలనలో ఉండటమే అందుకు కారణం. మహమూద్ షా పాలనాకాలం (క్రీ.శ.1482 1518) వరకు బహమనీ సుల్తానుల ఏలుబడిలో ఉన్న ఈ ప్రాంతం బహమనీ సామ్రాజ్య విచ్ఛిన్నం తరువాత క్రీ.శ. 1512 నుండి క్రీ.శ. 1687 వరకు గోల్కొండ నవాబుల పాలన కిందికి వెళ్ళింది. ఏటికొప్పాక ముస్లిం పాలకులచే ఆంధ్ర క్షత్రియులకు ఇచ్చిన ఏడు గ్రామాల మొఖాసా అని చరిత్ర చెబుతోంది. చింతలపాటివారు ఇక్కడి ఆనువంశిక మొఖాసాదారులు. వీరు ఆది నుండి ఈ కళ ఎట్టి పరిస్థితులలోనూ అంతరించి పోకూడదనే లక్ష్యంతో ఏటికొప్పాకకు దేశ విదేశాలలో ఇంతటి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఇక్కడి బొమ్మల పరిశ్రమను పునరుద్ధరించి, దానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఎంతగానో కృషిచేస్తున్నారు. ఈ చరిత్రను పరిశీలిస్తే ఏటికొప్పాక బొమ్మలు దాదాపు 500 సంవత్సరాల నుండి ఉన్నాయని తెలుస్తుంది.

**సంప్రదాయ రంగులు** ఒకప్పుడు ఏటికొప్పాక బొమ్మలకు సంప్రదాయ రంగులు వాడేవారు. 1909 నుండి బ్రిటిషువారి ప్రభావం వల్ల కెమికల్ రంగులను బొమ్మలకు అద్దారు.

ఆ తరువాత ఇక్కడి కళాకారుడు చింతలపాటి వెంకటపతిరాజు ఏటికొప్పాక బొమ్మల పునరుద్ధరణలో భాగంగా 1992 నుండి ప్రకృతి రంగులను వాడటం మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఈ కళను కాపాడి అభివృద్ధిచేయటమే లక్ష్యంగా పనిచేస్తున్న శ్రీ చింతలపాటి వెంకటపతిరాజు కృషిని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఏటికొప్పాక మొఖాసాదారుల కుటుంబానికి చెందిన సి.వి. రాజు తన తాత, తండ్రుల బాటలోనే పయనిస్తూ ఈ అద్భుత కళను అంతరించి పోకుండా కాపాడే కృషిని మరింత ముందుకు తీసుకెళ్లడమే కాక, పర్యావరణానికి హితకరమైన సహజసిద్ధమైన రంగుల వాడకాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చే కృషి చేస్తుండటం విశేషం. ఈయన తన 17 వ ఏట ఈ బొమ్మల తయారీ రంగంలో ప్రవేశించి శిక్షణ పొందారు. ఈ రంగంలో పనిచేసే కళాకారుల కృషికి తగిన గుర్తింపు, ప్రతిభకు తగిన ప్రతిఫలం వారికి దక్కాలంటే ఏమి చెయ్యాలో నవ్యరీతులలో ఈయన ఆలోచించారు. కొత్త ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో తరచు



జరిగే అంతర్జాతీయ కళాకృతుల ప్రదర్శనలలో ఏటికొప్పాక బొమ్మలను తప్పక ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తూ, ఈ కళకు అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు తెచ్చారు. వరల్డ్ క్రాఫ్ట్ కౌన్సిల్, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లతో సంపర్కం పెట్టుకుని ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ మార్కెట్ ఏర్పడాలంటే ఏమి చెయ్యాలో, అందుకు నేడున్న అవరోధాలు ఏమిటో కూడా తెలుసుకున్నారు. విషపూరితాలైన కృత్రిమ వర్ణాల స్థానంలో ప్రకృతిసిద్ధమైన, వృక్షోత్పాదనలైన రంగులు వాడితేనే అమెరికా, ఐరోపా దేశాలు తమ బొమ్మలను దిగుమతి చేసుకుంటాయనే వాస్తవాన్ని సి.వి.రాజు గ్రహించారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొని వస్త్రాలపై, బొమ్మలపై ప్రాకృతిక వర్ణాలను వినియోగిస్తే కలిగే ఫలితాలపై పరిశోధనలు చేశారు. వృక్షాల ఆకులు, పూలు, కాయలు, విత్తనాలు, కాండం బెరడు, వేళ్ళు వంటివాటినుంచి 12 రకాల సహజసిద్ధమైన రంగులను రూపొందించారు. నిరపాయకరమైన (టాక్సిక్ ఎలిమెంట్ లేని) ఈ ప్రాకృతిక వర్ణాల వాడకంతో పలు దేశాలకు ఏటికొప్పాక బొమ్మల ఎగుమతులకు అవకాశాలు మెరుగయ్యాయి. ఆ కారణంగానే ప్రస్తుతం ఏటికొప్పాక బొమ్మలు అంతర్జాతీయ మార్కెట్లలో చైనీస్ బొమ్మలతో పోటీ పడగలిగే స్థాయికి క్రమంగా చేరుకుంటున్నాయి. ముంబైలోని ఛత్రపతి శివాజీ వస్తు సంగ్రహాలయ (ఒకప్పటి ప్రిన్సు ఆఫ్ వేల్స్ మ్యూజియం) లోనూ, జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలోని ప్రదర్శితాంశాలలోనూ ఇవాళ ఏటికొప్పాక బొమ్మలు చోటుచేసుకున్నాయంటే అందుకు ప్రధానంగా వీటి ప్రాచుర్యానికి చింతలపాటి వేంకటపతి రాజు చేస్తున్న కృషే కారణం. ఈ కారణంగా వెంకటపతిరాజు 2023లో భారతప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. మరో కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి బెస్ట్ క్రాఫ్ట్ మెన్గా రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నారు. ఏటికొప్పాక సూక్ష్మ శిల్పకళకు కూడా పేరుగాంచింది. కేవలం 1.2 మిల్లీ మీటర్ల నిడివిగల గింజ యొక్క సగభాగం మీద శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడులతో కూడిన శ్రీరామ పట్టాభిషేక దృశ్యాన్ని 2017లో చెక్కిన శ్రీశైలపు చిన్నయాచారి అనే కళాకారుడు చిన్న వయసులోనే ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టే ప్రయత్నంలో ఉండడం విశేషం. అలాగే ఆయన 'గుడ్డులో గుడ్డు' అనే కళాకృతిలో ఒక గుడ్డులో



మరొకటిగా మొత్తం 30 కొయ్య గుడ్లను అమర్చి జాతీయస్థాయిలో బొమ్మల తయారీకి గాను ఇచ్చే కమల అవార్డును స్వంతం చేసుకోవటం మరో విశేషం.

ఏటికొప్పాక బొమ్మలకు సంప్రదాయ రంగులను వాడటం ఆచారంగా వస్తుంది. ఆ ప్రాంతంలోని కొన్ని ఎంపిక చేసిన చెట్ల బెరడుల నుండి, కొన్ని మొక్కల విత్తనాల పొడుల నుండి తీసిన రంగులు బొమ్మలకు వేస్తారు. బెరడు, విత్తనాల నుండి తీసిన చిక్కని కషాయం కరిగించిన లక్కతో కలిపి, లక్కపుల్లలను తయారుచేసి ఎండబెడతారు. ఆ ఎండు లక్క పుల్లలను బొమ్మలకు అద్ది ఆ తర్వాత వేడి చేస్తారు. తద్వారా బొమ్మల మీద రంగులు ఒకేలా అద్దుకుంటుంది. గుండ్రని ఆ బొమ్మ భాగాలలో ఎక్కడో ఒకచోట ఎక్కువ, మరోచోట తక్కువ అంటనివ్వకుండా ఎంతో నేర్పుతో



ఏటికొప్పాక కళాకారులు ఈ బొమ్మలను తయారుచేస్తారు. ఏటికొప్పాక బొమ్మల ఫినిషింగ్ చాలా బాగుంటుంది. చూడగానే ఆకట్టుకునే రూపాలు, రంగులలో బొమ్మలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ కళాకారులు ప్రధానంగా 'అంకుడు' (రైటియా టింక్టోరియా) అని పిలిచే చెట్ల నుండి వచ్చే కలపను ఉపయోగిస్తారు.

ఇది స్వభావంలో మృదువైనది. ఈ బొమ్మలకు పదునైన అంచులు ఉండవు. ముచ్చటైన గణేశుని బొమ్మలు, హరిదాసు, గొల్ల పడుచు బొమ్మలు, పిచ్చుకలు, బాతులు, ఫ్లెమింగోల వంటి పలు రకాల పక్షుల బొమ్మలు, రకరకాల ఫలాల బొమ్మలు, ఆకర్షణీయమైన లక్క పిడతలు, భరిణెలు, వంట చట్లు, తల్లీ బిడ్డల బొమ్మలు, ట్రాక్టర్లు, సైకిళ్ళు, మోటారు సైకిళ్ళ వంటి బొమ్మలు ప్రకాశవంతమైన రంగులలో మెరిసిపోతూ ఏటికొప్పాక హస్తకళాకారుల ప్రతిభకు, నైపుణ్యానికి అద్దం పడతాయి. వీరి కళా నైపుణ్యానికి అకాశమే హద్దు. సంప్రదాయ కళకు తమ సృజనాత్మకతను జోడించి, వీరు నిత్యం తమ ప్రతిభను మెరుగుపరచు కుంటూ మరిన్ని కొత్త కొత్త కళా రూపాలకు జీవం పోస్తున్నారు. ప్రస్తుతం వీరు రూపొందిస్తున్న అంశాలు 170 దాకా ఉన్నాయంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. వీరు తాము రూపొందిస్తున్న సంప్రదాయ కళాకృతులకు తోడు ఎప్పటికప్పుడు మరిన్ని ఐటం డిజైన్లు రూపొందించు కుంటూ, వాటి తయారీలో తమ ప్రతిభను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం బొమ్మల తయారీ మీద ఆధారపడి జీవిస్తున్న 160కుటుంబాలు ఈ గ్రామంలో ఉన్నాయి. అనాదిగా రథ నిర్మాణంలో పేరొందిన కంసాలి (విశ్వబ్రాహ్మణ) కులస్థులు ఈ బొమ్మల తయారీలోనూ నిపుణులుగా పేరొందారు. సంఖ్యాపరంగా వారి తరువాత ఈ గ్రామంలోని పద్మశాలీయులు ఈ బొమ్మల తయారీ కళలో నైపుణ్యం సాధించి, ఆ వృత్తిలో స్థిరపడ్డారు. ఇక షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన కొందరు కుడా అడవి నుంచి కర్ర తేవడం వంటి సహాయక కార్యక్రమాలలో ఉపాధి పొందుతున్నారు.

2017లో ఈ బొమ్మలకు జిఐ విశిష్ట గుర్తింపు కూడా దక్కింది. ప్రపంచవ్యాప్తంగా ఈ బొమ్మలకు ప్రత్యేక ఉంది. పర్యావరణ ఫ్రెండ్లీగా ఉండడంతోపాటు చిన్నపిల్లలు ఆడుకున్న ఎటువంటి హాని చేయని విధంగా ఉంటాయి. ఏటికొప్పాక గ్రామానికి చెందిన చింతల లావణ్య అనే కళాకారిణి లక్క బొమ్మలు తయారు చేయడం నేర్చుకుని కళపై ఉన్న మక్కువతో వందల బొమ్మలకు ప్రాణం పోసారు. అంతేకాదు పురుషులతో సమానంగా మహిళలు కూడా లక్క బొమ్మల తయారీలో రాణించాలని సంకల్పించింది. తాను నేర్చుకున్న కళను సాటి మహిళలకు నేర్పించి ఆదర్శంగా నిలుస్తున్నారు. 150 మంది మహిళలకు ఈ వృత్తిలో శిక్షణనిస్తూ ఇప్పటికే లక్క బొమ్మల తయారీలో ఏటికొప్పాక ట్రేడ్ మార్క్ సంపాదించారు. ఈ ఏడాది (2025) రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటి కొప్పాక లక్క బొమ్మల శకటం తన ప్రత్యేకతను చాటుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ముందు వినాయకుడు, చివర ఎత్తైన శ్రీ వేంకటేశ్వరస్వామి రూపాలు, ఇరువైపులా బొబ్బిలి వీణలు, తెలుగువారి కట్టుబొట్టును ప్రతిబింబించే బొమ్మల కొలువు, చిన్నారుల ఆటపాటల చిత్రాలతో రూపొందించిన రాష్ట్ర శకటం ఆధ్యాత్మిక భావాన్ని, సంస్కృతిని చాటిచెప్పింది. ఇందులో ఉపయోగించినవన్నీ ఏటికొప్పాక బొమ్మలే కావడం విశేషం. శకటంపై ఆదిదేవుడు విఘ్నేశ్వరుడు. తిరుపతి వెంకటేశ్వర స్వామి తో పాటు పల్లె వాతావరణం అన్ని ప్రతిబింబించేలా బొమ్మలు, హిందూ సంప్రదాయంలో జరిగే వివాహ వేడుక వధూవరులు, పురోహితుడు, సన్నాయి మేళం, వీణలు, హరిదాసు ఇతర దేవతామూర్తులతో రూపొందించారు. వాస్తవానికి ఇది ఒక కళాకారుడు రూపొందించిన అద్భుతమైన బొమ్మల సమూహం, ఎలమంచిలి మండలం యువ కళాకారుడు గొరసా సంతోష్ కుమార్ ఈ నమూనాను తయారు చేశారు. ఏడో తరగతి వరకు చదువుకున్న సంతోష్ తల్లిదండ్రులు హస్త కళాకారులు. వారి నుంచి నేర్చుకున్న హస్తకళకు పదును పెట్టి మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అద్భుతమైన బొమ్మను తయారు చేశారు. సంతోష్ చేసిన బొమ్మల సమూహాన్ని నమూనాగా రాష్ట్ర ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపింది. అంకుడు కర్రతో తయారు చేసిన బొమ్మల నమూనాతో శకటాన్ని తయారు చేయించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రానికి ప్రతిపాదించారు. ఆ నమూనా శకటానికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో సంతోష్ కుమార్ ప్రతిభకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ప్రోత్సాహం కరవై అంతరించిపోయే దశకు చేరుకున్న మన తెలుగువారి ఏటికొప్పాక అద్భుత హస్తకళను కాపాడుకుందాం. కళాకారుల కృషికి వారికి తగిన ప్రతిఫలం, గుర్తింపు రావాలని అందరం మనసారా కోరుకుందాం.



## ఏప్రిల్ 27, 2025 నుండి మే- 3, 2025 వరకు



# వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


## మేషం



ఈ వారం బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. పనులు నిదానంగా సాగుతాయి. నూతన ప్రయత్నాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సర్పదోష నివారణ చూర్ణముతో సర్వరక్షా చూర్ణము కలిపి స్నానం చేయటం వలన సర్పదోషాలు తొలగిపోతాయి.

## వృషభం



ఈ వారం బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థికాభివృద్ధి కొరకు లక్ష్మీ కటాక్షాన్ని ఉపయోగించండి. ఇది చాలా మంచిది. రాజకీయ, కళారంగాలలోని వారికి కొంత అనుకూలంగా ఉంటుంది. జీవితభాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

## మిథునం



ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ప్రయాణాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై చికాకు పెడతాయి. యజ్ఞ భస్మాన్ని ధరించడం వలన యజ్ఞం చేసిన ఫలితం కలుగుతుంది. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

## కర్కాటకం



ఈ వారం వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. మీ శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. దుష్టశక్తుల నివారణకు, అర్థంకాని రోగాల నుండి రక్షణకు నాగబంధాన్ని ఉపయోగించండి.

## సింహం



ఈ వారం సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. ప్రతి నిత్యం నాగసింధూరం ధరించడం వలన నరదిష్టి తగలకుండా ఉంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

## కన్య



ఈ వారం పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. పారిశ్రామిక, రాజకీయరంగాలలోని వారు ప్రభుత్వం నుండి ఆహ్వానం అందుకుంటారు. నిత్యం శ్వేతార్క గణపతికి సుమంగళి పసుపురాసి, ఆరావళి కుంకుమతో బొట్టు పెట్టవలెను. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

## తుల



ఈ వారం సోదరుల నుండి వచ్చిన ఆహ్వానాలు సంతోషం కలిగిస్తాయి. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. దీర్ఘకాలిక రుణాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఆర్థికంగా బలం చేకూరుతుంది. ఆస్తి వ్యవహారాలలో ఎదురైన వివాదాలను పరిష్కరించుకుంటారు. నిత్యం లక్ష్మీదేవికి ఆరావళి కుంకుమతో పూజ చేయటం అన్ని విధాల మంచిది.

## వృశ్చికం



ఈ వారం సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమై ఊరట చెందుతారు. అప్రయత్న కార్యసిద్ధి. ఎంతో కాలంగా ఊరిస్తున్న ఒక అవకాశం దగ్గరకు వచ్చి ఆశ్చర్యపోతారు. ఋణబాధలు తొలగుతాయి. వివాహ, ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. సర్పదోష నివారణ కంకణం ధరించండి. ఇంటి కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలలో అభివృద్ధి సాధిస్తారు.

## ధనస్సు



ఈ వారం రుణబాధలు నుండి బయటపడతారు. అందరిలోను ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. నానారకాల అరిష్టాలు, ఇబ్బందులు, శత్రుబాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

## మకరం



ప్రభుత్వపరంగా, వ్యక్తులపరంగా రావలసిన ప్రయోజనాలు దక్కుతాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. రాజకీయ, కళారంగాల వారికి పదవీయోగాలు వుంటాయి. కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. అరటినార వత్తులతో అష్టమూలికా తైలం కలిపి నిత్యం దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది.

## కుంభం





ఈ వారం సంతానం సాంకేతికపరమైన విద్యావకాశాలు పొందుతారు. శ్రమానంతరం కాంట్రాక్టులు దక్కుతాయి. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. లక్ష్మీతామర వత్తులు అష్టమూలికాతైలంతో దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. ఆస్తివివాదాలు తీరి ఊరట చెందుతారు. నూతనోత్సాహంతో పనులు సకాలంలో పూర్తి చేస్తారు.


## మీనం



ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. నిత్యం లక్ష్మీదేవికి ఎరుపు, పసుపు వత్తులు అష్టమూలికాతైలంతో కలిపి దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. సంతానమునకు నూతన ఉద్యోగావకాశాలు రాగలవు. భూముల క్రయవిక్రయాలలో లాభాలు రాగలవు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.


చీమకైనా 'హాని' చేయని మనిషమ్మా ఆయన..!!
అబ్బో.. రాత్రి మావాళ్ల మీద చీమల మందు చల్లింది ఆయనేనమ్మా!!


'భూధార్' లో ఉన్న ఫోటో, 'ఆధార్' లో ఉన్న ఫోటో మ్యాచ్ అవడం లేదు.. రెండూ నీవేనని సర్టిఫికేట్ తీసుకురా!!
మేనేజరు


ఈసారి మీదేశం నా ఒక్కదానికే 'వీసా' ఇచ్చింది..! అందుకే మా వారు రాలేకపోయారు!!

# కార్టూన్ కా'ర్టూన్'







కాదేది కవితకనర్హం అన్నట్లు పర్యాటకులను ఆకర్షించడానికి నిర్వాహకులు విభిన్నమైన ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటివే ఫ్లోటింగ్ విల్లాస్. వీటిలో ప్రయాణం ఆస్వాదించాలంటే థాయిలండ్ వెళ్లాల్సిందే మరి.



